/manamnews
www.manamnews.com

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

తిరుపతి
గురువారం
05-10-2023
వెల. రూ.5
• సంపుటి : 7 • సంచిక : 272
పేజీలు : 8

AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM

భాద్రపద మాసం, గురువారం, తిథి : సప్తమి తె.05.41 వరకు, నక్షత్రం: మృగశిర, సా:07.40 వరకు, వర్జ్యం: ఉ.04.43-06.26 వరకు, దుర్ముహూర్తం: ఉ.10.06-10.53 వరకు, రాహుకాలం: మ.01.33-03.01 వరకు



## చైనా అణు సబ్ మెరైన్‌కు ఘోర ప్రమాదం

55 మంది దుర్మరణం

ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన 2



## పారిశ్రామికవేత్తలకు అన్ని విధాలా సాయం

ఉద్యోగ అవకాశాలు వచ్చే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం

పారిశ్రామిక రంగాభివృద్ధిలో మరో కీలక అడుగు

సీఎం జగన్ వర్చువల్ సమీక్ష

ఆహార శుద్ధి పరిశ్రమలను ప్రారంభించిన సీఎం జగన్

ఇందులో 3 కంపెనీల ప్రారంభం, 9 ప్రాజెక్టులకు శంకుస్థాపన, ఒక ప్రాజెక్టుకు సంబంధించి ఎంఓయూ

విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో ఒప్పందాలు చేసుకున్న కంపెనీలు కార్యరూపం

13 జిల్లాల్లో ఏర్పాటైన పరిశ్రమలతో 6,705 మందికి ప్రత్యక్షంగా ఉపాధి

సీఎం జగన్‌మోహన్ రెడ్డి

**అమరావతి, అక్టోబర్ 4 (మనం న్యూస్):** పారిశ్రామిక రంగాభివృద్ధిలో.. ఇవాళ మరో కీలక అడుగు పడింది. ఆహారశుద్ధి పరిశ్రమలను క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. మొత్తం 13 ప్రాజెక్టుల ద్వారా దాదాపు రూ.2,851 కోట్ల పెట్టుబడులు పెట్టింది. అలాగే.. 6,705 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. బుధవారం ఏడు ప్రాజెక్టులకు సీఎం వైయస్ జగన్ భూమి పూజతో పాటు మరో ఆరు ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం వైయస్.జగన్ మాట్లాడుతూ.. దాదాపుగా 13 యూనిట్లకు సంబంధించిన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసుకున్నాం. ఇందులో ..మిగతా 2లో



## సిక్కింను ముంచెత్తిన వరదలు

వరదల్లో 23 మంది ఆర్మీ సిబ్బంది గల్లంతు

**గ్యాంగ్‌టక్, అక్టోబర్ 4:** ఈశాన్య రాష్ట్రం సిక్కింను ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. గత రాత్రి కురిసిన కుండపోత వర్షానికి ఉత్తర సిక్కింలోని లాచెన్ లోయలో గల తీస్తా నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో వరదలు సంభవించాయి. ఈ వరదల్లో 23 మంది ఆర్మీ సిబ్బంది గల్లంతైనట్లు రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. వారి కోసం ..మిగతా 2లో



## పసుపు బోర్డు, గిరిజన వర్సిటీకి కేంద్రం ఆమోదం

కృష్ణా జలాల వివాదంపై బోర్డు ఏర్పాటు

ఉజ్వల గ్యాస్ సిలిండర్ ఇక 300 రాయితీ

కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయాలు ప్రకటన

న్యూఢిల్లీ, అక్టోబర్ 4 : కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. తెలంగాణలో జాతీయ పసుపు బోర్డు ఏర్పాటుతో పాటు ములుగులో సమ్మక్క సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. తెలంగాణలో గిరిజనుల ఉన్నత విద్య కోసం ఈ వర్సిటీని రూ.889.07 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్నారు. కేంద్ర కేబినెట్ నిర్ణయాలను కేంద్రమంత్రులు అనురాగ్ ఠాకూర్, కిషన్ రెడ్డి సహా పలువురు మీడియాకు వెల్లడించారు. ఉజ్వల పథకం లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్‌పై ఇచ్చే రాయితీని రూ.300లకు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల వివాదాల పరిష్కారానికి కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య జల వివాదాల పరిష్కారానికి విధివిధానాలు రూపొందించాలని రెండో కృష్ణా ట్రైబ్యునల్‌కు మంత్రివర్గం విజ్ఞప్తి చేసిందన్నారు. ఈ నిర్ణయం వల్ల 50లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని కిషన్ రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. కొత్త నిబంధనలు రూపొందించి తమ వాటాను తేల్చాలని తెలంగాణ కోరుతోందన్నారు. ప్రస్తుత, భవిష్యత్ అవసరాలను ..మిగతా 2లో



## ఔషధాల కొరతతో మరణాలా..?

ఆసుపత్రుల్లో మృత్యుఘోషపై బాంబే హైకోర్టు సీరియస్

**ముంబయి, అక్టోబర్ 4 :** మహారాష్ట్ర ఆసుపత్రుల్లో మృత్యుఘోషను బాంబే హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. నాందేడ్‌తోపాటు ఛత్రపతి శంభాజీనగర్ ఆసుపత్రుల్లో వరుసగా రోగులు మృత్యువాతపడటాన్ని సుమోటోగా స్వీకరించింది. చీఫ్ జస్టిస్ డీకే ఉపాధ్యాయ, జస్టిస్ ఆరిఫ్ ఎస్ డాక్టర్లతో కూడిన డివిజన్ బెంచ్.. బడ్జెట్‌లో ఆరోగ్యానికి ప్రభుత్వం ఎంత ..మిగతా 2లో



## చంద్రబాబు అరెస్టు బాధాకరం

తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ట్వీట్ 2

## చంద్రబాబు పిటిషన్లపై విచారణ నేటికి వాయిదా

కస్టడీ పిటిషన్లపై కోర్టులో హోరాహోరీ వాదనలు

**విజయవాడ, అక్టోబర్ 4 (మనం న్యూస్):** చంద్రబాబు బెయిల్, కస్టడీ పిటిషన్‌లపై విచారణను విజయవాడ ఏసీబీ కోర్ట్ గురువారానికి వాయిదా వేసింది. ఇప్పటికే ఇరువురు న్యాయవాదుల వాదనలు విన్న న్యాయమూర్తి మిగతా వాదనలను గురువారం ఉదయం వింటానని చెప్పారు. బుధవారం ఉదయం నుంచి చంద్రబాబు బెయిల్, కస్టడీ పిటిషన్లపై కోర్టులో హోరాహోరీ వాదనలు జరిగాయి. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో లభించిన అన్ని ఆధారాలు ..మిగతా 2లో





## జగనన్న.. ఓ విపత్తు

జగన్‌ది రూపాయి పావలా ప్రభుత్వం

ఇళ్ల పేరుతో భారీ స్కాం..

లెక్కలతో సహా గుట్టు రట్టు చేసిన పవన్

ఉపాధి కూలీల పొట్ట కొట్టారు

సగానికి సగం ఉపాధి హామీ నిధులు దారి మళ్లించారు

ఇళ్ల పేరుతో రూ.4వేల కోట్లు దోచుకున్నారు

నేను పదవులపై ఆశపడి రాజకీయాల్లోకి రాలేదు

వైసీపీ కేసులకు నేను భయపడను

జైలుకు వెళ్లేందుకూ సిద్ధమే : పవన్ కల్యాణ్

### పవన్‌కు పోలీసుల నోటీసులు

2

ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదు: ఎస్పీ

**పెడన(కృష్ణా జిల్లా), అక్టోబర్ 4 (మనం న్యూస్):** జగన్‌ది రూపాయి పావలా ప్రభుత్వ మని జనసేన అధినేత పవన్ కల్యాణ్ దుయ్యబట్టారు. సీఎం జగన్‌కు ఒంట్లో పావలా దమ్ము లేదని ధ్వజమెత్తారు. వైసీపీ సర్కార్కు పోయే రోజులు దగ్గర పడ్డాయన్నారు. వైసీపీ పథకాల్లో అంతా డొల్లతనమేనని.. రాబోయేది జనసేన – టీడీపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ఏపీకి జగన్ భవిష్యత్ కాదని.. విపత్తు అని పవన్ కళ్యాణ్ అన్నారు. నేను పదవులపై ఆశపడి రాజకీయాల్లోకి రాలేదని, వైసీపీ కేసులకు నేను భయపడనని, జైలుకు వెళ్లేందుకు కూడా సిద్ధమేనని ఆయన స్పష్టం చేశారు. బుధవారం వారాహి యాత్రలో భాగంగా కృష్ణా జిల్లా పెడనలో పవన్ ప్రసంగించారు. వైసీపీ పాలనపై నిప్పులు చెరిగారు. ఓట్లు వేయించుకునేందుకే వైసీపీ ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోంది. అమలు వరకు వచ్చేసరికి వైసీపీ పథకాల్లో అంతా డొల్లతనమే. నిధుల మళ్లింపులో రాష్ట్రానిదే అగ్రస్థానమని కేంద్రం చెబుతోంది. వైసీపీ ప్రభుత్వం.. ..మిగతా 2లో



## కుల్గామ్‌లో ఎన్‌కౌంటర్..

ఇద్దరు ఉగ్రవాదులు హతం

అనుమానిత ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు మూడు రోజులుగా గాలింపు

ఉగ్రవాదులు ఎదురు కాల్పులు జరపడంతో ఇద్దరు ఆర్మీ సిబ్బందికి గాయాలు

**జమ్మూ, అక్టోబర్ 4 :** జమ్మూ కశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భద్రతా బలగాలు ఇద్దరు ఉగ్రవాదుల్ని హతమార్చాయి. మృతదేహాలను ..మిగతా 2లో




2

## లోకేశ్‌ను అరెస్ట్ చేయొద్దు

సిఐడికి హైకోర్టు ఆదేశం

నారా లోకేశ్‌కు ఊరట

12 వరకు బెయిల్ పొడిగింపు

## నేడు విజయవాడకు లోకేశ్

జైలులో చంద్రబాబుతో ములాఖత్

యువగళం యాత్రపై సమీక్షిస్తామన్న అచ్చన్న 2



## ప్రతి క్షణం పోరాడతాం



ఇంతకాలం అజ్ఞాతంలో ఉన్నాం.. మళ్లీ చైతన్యం తెస్తాం

తెలంగాణలో టైం వచ్చింది..

ఓట్ల కోసం ఇక్కడ ఎన్టీఆర్ జపం

సినిమా వాళ్లు స్పందించకపోతే ఐ డోంట్ కేర్

నందమూరి బాలకృష్ణ 2

### మంచిమాట

తనని తాను
వశపరచుకోగలిగిన మనిషిని
దేవతలు సైతం ప్రభావితం
చేయలేరు, అతని
విజయాలను వారు
అపజయాలుగా మార్చలేరు..

శుభోదయం



## శ్రీ కపిలేశ్వర స్వామివారికి వెండి ఆభరణాల బహూకరణ

**తిరుపతి, అక్టోబర్ 4, (మనం న్యూస్) :** తిరుపతి శ్రీ కపిలేశ్వర స్వామివారికి బుధవారం వెండి నాగపడగ, వెండి కిరీటం తిరుపతికి చెందిన సూర నరహరి, కుసుమ దంపతులు బహూకరించారు. వీటిని దాతలు టీటీడీ ఈవో ఏవి ధర్మారెడ్డికి అందజేశారు. దాదాపు రూ.14లక్షలు విలువ గల 16కేజీల వెండితో తయారుచేసిన ఆభరణాలను స్వామివారికి బహూకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో దేవేంద్ర బాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.



## పసుపు బోర్డు, గిరిజన వర్సిటీకి కేంద్రం ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

దృష్టిలో ఉంచుకుని జలాల పంపిణీ చేయాలన్నారు. కేంద్రం నిర్ణయంతో తెలంగాణ ఆకాంక్ష నెరవేరుతుందని కిషన్ రెడ్డి తెలిపారు. ఉజ్వల పథకం కింద పేదలకు సరఫరా చేసే వంట గ్యాస్ సిలిండర్‌పై ప్రస్తుతం కేంద్రం రూ.200ల చొప్పున రాయితీ ఇస్తుండగా.. తాజాగా దాన్ని 300లకు పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం 14.2 కిలోల వంటగ్యాస్ సిలిండర్ మార్కెట్ ధర రూ.903 ఉండగా.. ఉజ్వల లబ్ధిదారులు రూ.703 చొప్పున చెల్లిస్తున్నారు. తాజాగా కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంతో ఇకపై ఆ లబ్ధిదారులంతా సిలిండర్‌కు రూ.603 చొప్పున చెల్లిస్తే చాలు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ బుధవారం సమావేశం అయింది. ఢిల్లీలోని ప్రధాని నివాసంలో జరిగిన ఈ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో భాగంగా తెలంగాణలోని పలు ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. తెలుగురాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీపై కృష్ణా ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తూ కేంద్రం తీర్మానం చేయడం గమనార్హం.

## ఔషధాల కొరతతో మరణాలా..?

(మొదటిపేజీ తరువాయి)

కేటాయించింది? పెట్టిన ఖర్చు..? తదితర వివరాలు తెలపాలని అడ్వకేట్ జనరల్ను ఆదేశించింది. గత మూడు రోజులుగా మహారాష్ట్రలోని ప్రభుత్వాసుపత్రుల్లో మృత్యు ఘోష వినిపిస్తోంది. నాందేడ్ ఆసుపత్రిలో 31 మంది, ఛత్రపతి శంభాజీనగర్లోని ఆసుపత్రిలో 18 మంది చనిపోయినట్లు అధికారులు వెల్లడించారు. గంటల వ్యవధిలో పదుల సంఖ్యలో రోగులు మృత్యువాతపడటం రాష్ట్రాన్ని కలవరపాటుకు గురిచేసింది. ఈ వ్యవహారంపై మోహిత్ ఖన్నా అనే న్యాయవాది బాంబే హైకోర్టుకు లేఖ రాశారు. దానిని పరిశీలించిన హైకోర్టు ధర్మాసనం.. ఓ పిటిషన్ దాఖలు చేయాలని, తద్వారా ఆదేశాలు జారీ చేస్తామని చెప్పింది. ఆసుపత్రుల్లో ఖాళీలు, ఔషధాల లభ్యత, ప్రభుత్వం ఖర్చుచేస్తున్న నిధులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించాలని సూచించింది. మధ్యాహ్నం (బుధవారం) సెషన్లో ఇదే అంశాన్ని ప్రస్తావించిన బాంబే హైకోర్టు.. ఈ ఘటనను సుమోటోగా స్వీకరిస్తున్నట్లు ప్రకటించింది. ఆసుపత్రి పడకలు, సిబ్బంది, అత్యవసర ఔషధాల కొరత ఉన్నట్లు వైద్యులు చెప్పడాన్ని తీవ్రంగా పరిగణించింది. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని అభిప్రాయపడింది. ఈ వ్యవహారంపై శుక్రవారం విచారణ జరుపుతామని.. ఆలోపు వివరాలన్నీ తమ ముందు ఉంచాలని ఆదేశించింది. మరోవైపు ఆసుపత్రుల్లో వరుస మరణాలను తీవ్రంగా పరిగణిస్తున్నామని మహారాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. పూర్తిస్థాయి విచారణ జరిపిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామని సీఎం ఏక్నాథ్ శిందే ఇప్పటికే ప్రకటించారు. అయితే, అసుపత్రుల్లో సిబ్బంది, ఔషధాల కొరత ఉందనివస్తోన్న వార్తలను ఆయన తోసిబుచ్చారు.

## కుల్గామ్‌లో ఎన్‌కౌంటర్..

(మొదటిపేజీ తరువాయి)

ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం నుంచి తరలించే ఏర్పాట్లు జరుగుతున్నాయని అధికారులు వెల్లడించారు. ఇద్దరు ఉగ్రవాదులు చనిపోయారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం నుంచి హతమైన ఉగ్రవాదుల మృతదేహాలను వెలికితీస్తున్నారు. ద కార్డన్ సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. అందుకు సంబంధించిన మరింత సమాచారం తెలియజేస్తామని కశ్మీర్ పోలీస్ జోన్ ట్విటర్లో (ఎక్స్) పోస్టు చేశారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల కదిలికను పసిగట్టే క్రమంలో భాగంగా బుధవారం ఉదయం భద్రతా బలగాలు కుల్గాం జిల్లాలోని పలు ప్రాంతాలను జల్లెడ పట్టాయి. ఈ క్రమంలో తారసపడిన ఉగ్రవాదులకు, భద్రతా బలగాలకు మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. కుల్గాంలోని కుజ్జర్ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ మొదలైంది. పోలీసులు, భద్రతా బలగాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయని' కశ్మీర్ జోన్ పోలీసు విభాగం వెల్లడించింది. రాజౌరీ జిల్లా కలకోటె అటవీ ప్రాంతంలో దాక్కున్న అనుమానిత ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు మూడు రోజులుగా గాలిస్తున్నాయి. సోమవారం ఉగ్రవాదులు ఎదురు కాల్పులు జరపడంతో ఇద్దరు ఆర్మీ సిబ్బంది గాయపడ్డారు. దాంతో ఉగ్రవాదుల కోసం వేట ప్రారంభించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, నిఘా పరికరాలను అందుకోసం వినియోగిస్తున్నారు.

## సిక్కింను ముంచెత్తిన వరదలు

(మొదటిపేజీ తరువాయి)

గాలింపు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. ఉత్తర సిక్కింలోని లొనాక్ సరస్సు ప్రాంతంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో తీస్తా నదిలో నీటి మట్టం ఒక్కసారిగా పెరిగింది. అదే సమయంలో చుంగ్‌థాంగ్ డ్యామ్ నుంచి నీటిని విడుదల చేయడంతో పరిస్థితి తీవ్రతరమైంది. దిగువ ప్రాంతంలో నీటిమట్టం 20 అడుగుల మేర పెరిగింది. దీంతో అకస్మాత్తుగా క్లౌడ్ బరస్ట్ వల్ల వరదలు వెల్లువెత్తాయి. సింగ్టామ్ సమీపంలోని బర్దంగ్ వద్ద పార్క్ చేసిన ఆర్మీ వాహనాలు వరద ప్రవాహంలో కొట్టుకుపోయాయి. ఇందులో 23 మంది ఆర్మీ సిబ్బంది గల్లంతైనట్లు రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. గల్లంతైన సిబ్బంది ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆకస్మిక వరదల వల్ల లాచెన్ లోయ వెంబడి ఉన్న అనేక ఆర్మీ స్థావరాలకు కూడా భారీ నష్టం వాటిల్లింది. నది పొంగి ప్రవహించడంతో తీస్తా నదిపై ఉన్న సింథమ్ ఫుట్ బ్రిడ్జి కూలిపోయింది. ఆకస్మిక వరదలతో రాష్ట్రంలోని చాలా రోడ్లు, వంతెనలు ఎక్కడికక్కడ కొట్టుకుపోయాయి. దీంతో అప్రమత్తమైన సిక్కిం ప్రభుత్వం బుధవారం రాష్ట్రంలో హై అలర్ట్ ప్రకటించింది. భారీ వర్షాలు, ఆకస్మిక వరదల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తీస్తా నది సమీప ప్రాంతానికి వెళ్లొద్దని హెచ్చరించింది. మరోవైపు వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టింది. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది.

## చైనా అణు సబ్ మెరైన్‌కు ఘోర ప్రమాదం

న్యూఢిల్లీ, అక్టోబర్ 4: అణు శక్తితో పనిచేసే చైనా సబ్ మెరైన్ '093- 417' ఘోర ప్రమాదానికి గురైంది. ప్రమాదం జరిగిన సమయంలో జలాంతర్గామిలో ఉన్న 55 మంది సబ్ మెరైన్ల ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటన ఆగస్టులోనే జరిగినా.. చైనా ఇప్పటి వరకు ఈ విషయంపై ఎలాంటి ప్రకటన చేయలేదు. బ్రిటన్ ఇంటెలిజెన్స్ వర్గాల నివేదికల ఆధారంగా డైలీ మెయిల్ ఈ ప్రమాదంపై కథనాన్ని ప్రచురించింది. అమెరికా నేవీ వర్గాలు ఈ జలాంతర్గామి ప్రమాదం గురించి ఆగస్టులోనే సమాచారం వెల్లడించాయని డైలీ మెయిల్ తెలిపింది. ఈ ప్రచారాన్ని చైనా, తైవాన్ తోసిపుచ్చాయని పేర్కొంది. కానీ, ఈ ప్రమాద విషయాన్ని తాజాగా బ్రిటన్ సబ్ మెరైనర్లు సైతం ధ్రువీకరించినట్లు డైలీ మెయిల్ కథనం స్పష్టం చేసింది.

# జగనన్న.. ఓ విపత్తు

(మొదటిపేజీ తరువాయి)



ఉపాధి కూలీల పొట్ట కొట్టింది. ఉపాధి హామీ కూలీలకు సంబంధించిన నిధులు రూ.336 కోట్లు దారి మళ్లించారని పవన్ ఆరోపించారు. ప్రశ్నించే వారిపై పలురకాల కేసులు పెడుతున్నారు. అతిఎక్కువ రాజద్రోహం కేసులు ఏపీలోనే నమోదయ్యాయి. కేసులకు భయపడితే నాలాంటి వారు రాజకీయాల్లో ఎందుకు వస్తారు? ఈ ప్రభుత్వం ఉద్యోగాలు ఇస్తే యువత ఎందుకు మా సభలకు ఎందుకు వస్తారు? హత్యలు చేసేవారికి, చేయించేవారికి జేజేలు కొడుతున్నారు. జగనన్న.. ఏపీ బంగారు భవిష్యత్తు కాదు.. ఆయనో విపత్తు. 28 లక్షల ఇళ్లు కడతామని చెప్పి 3 లక్షల ఇళ్లే కట్టారు. ఇళ్ల పేరుతో రూ.4 వేల కోట్లు దోచేశారని నివేదికలు చెబుతున్నాయి. వైసీపీ గద్దె దించడమే తమ లక్ష్యమన్నారు. ఇసుక మాఫియాను అడ్డుకున్నందుకు టీడీపీ, జనసేన కార్యకర్తలపై కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసులకు భయపడే వాళ్లు రాజకీయాల్లోకి ఎందుకు వస్తారన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రజలంతా ఒక్కటి కావాలని పిలుపు నిచ్చారు. రాజకీయ నాయకుల విభేదాలు పాలసీల వరకే పరిమాతం కావాలని పవన్ కల్యాణ్ సూచించారు. ప్లాస్టిక్‌పై నిషేదం పేరుతో ప్లెక్సీలను నిషేధించారు. నా సినిమాలు, పుట్టినరోజు వచ్చినప్పుడే ప్లాస్టిక్‌పై వీరికి నిషేధం గుర్తుకువస్తుంది. ఏపీలో కుల భావన ఎక్కువ.. జాతి భావన తక్కువ. కొనకళ్ల నారాయణపై దాడి.. నాకు చాలా ఆవేదన కలిగించింది. ప్రజలను కులాలుగా విడదీసి నేను రాజకీయాలు చేయను. కులాలకు, మతాలకు అతీతంగా ప్రజలందరినీ చూస్తా. ఏపీ ప్రజలు గర్వంగా తలెత్తుకుని బతకాలనేదే నా ఆశయం. నాకు పదవులపై ఆశ ఉంటే 2009లోనే ఎంపీ పదవిలో ఉండేవాడిని.

**సోనియా చూస్తారని భయపడి..!**

ప్రతిపక్ష నేతలను ఆయా కులాల వారితో తిట్టించడం జగన్ నైజం. జగన్‌కు ఒంట్లో పావలా దమ్ము లేదు. సోనియా చూస్తారని భయపడి చాటుగా ప్లకార్డు పట్టుకున్న వ్యక్తి జగన్. రాష్ట్ర యువత కూడా కులాలకు అతీతంగా ఆలోచించాలి. మనలో విభేదాలు పాలసీల వరకే పరిమితం చేసుకోవాలి. రాష్ట్ర ప్రయోజనాల వద్దకు వచ్చేసరికి మనమంతా ఒక్కటి కావాలి. వచ్చే ఎన్నికల తర్వాత జనసేన - టీడీపీ ప్రభుత్వం రాబోతోంది అని పవన్ ధీమా వ్యక్తం చేశారు.

**వైసీపీకి కొమ్ముకాస్తున్న పోలీసులు**

చంద్రబాబును అరెస్టు చేసినప్పుడు నేను ఏసీబీ కోర్టుకు వెళ్తానని మీకు ఎవరు చెప్పారని, పోలీసులు వైసీపీకి కొమ్ముకాస్తున్నారని, ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను నేను ఎన్నోసార్లు కలిశానని పవన్ కళ్యాణ్ అన్నారు. జగన్ గురించి చెప్పాలనుకుంటే ఎప్పుడో చెప్పేవాడినని, ఎక్కడ ట్యాక్స్ కట్టలేదో జీఎస్టీ వాళ్లకు తెలుసన్నారు. అలాంటిది ఏపీలో ఏం జరుగుతుందో కేంద్రానికి, ప్రధానికి తెలుస్తుందన్నారు. కానీ వారి పరిస్థితులేంటో అర్థం చేసుకోవచ్చన్నారు. పులివెందుల అంటే ఒకప్పుడు సరస్వతి నిలయమని, అలాంటి చదువుల నేలను ప్రస్తుతం గొడవలకు కేంద్రం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను వాలంటీర్లపై చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని, అరెస్టు చేసినా పర్లేదన్నారు. ఎక్కడికైనా వస్తాను..ప్రజల డబ్బులను వాలంటీర్లకు దోచిపెడుతున్నారని, లక్షల కోట్లు జగన్ దోచేశారని ఆరోపించారు.

## పవన్‌కు పోలీసుల నోటీసులు

నా వారాహి యాత్ర బహిరంగ సభల్లో హింసకు కుట్ర పన్నారని వైఎస్సార్సీపీపై చేసిన ఆరోపణలకు సంబంధించి నటుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు కృష్ణా జిల్లా పోలీసులు బుధవారం నోటీసులు జారీ చేశారు. అక్టోబర్ 4న కృష్ణా జిల్లా పెడనలో నిర్వహించనున్న వారాహి యాత్రపై వైఎస్సార్సీపీ దాడికి పాల్పడిందని మచిలీపట్నంలో జరిగిన ర్యాలీలో కల్యాణ్ మాట్లాడుతూ తనకు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం అందిందని అన్నారు. ఆ వ్యాఖ్యలను నిరూపించేందుకు ఆధారాలు కావాలని, ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదని కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా అన్నారు. కృష్ణా జిల్లా పెడనలో వారాహి యాత్రకు పటిష్ట ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆ నోటీసులో, 'బాధ్యతా రహిత వ్యాఖ్యలు పరిణామాలను కలిగి ఉంటాయి. రెచ్చగొట్టే వ్యాఖ్యలు, సంజ్ఞలను నివారించండి. పవన్ కంటే పోలీసులకు మెరుగైన నిఘా వ్యవస్థ ఉంది. సంఘ వ్యతిరేక శక్తులు ఉంటే చర్యలు తీసుకుంటాం. పవన్ కళ్యాణ్ తన వారాహి యాత్ర నాలుగో దశను అక్టోబర్ 1న అవనిగడ్డలో బహిరంగ సభతో ప్రారంభించారు. అక్టోబరు 2, 3 తేదీల్లో మచిలీపట్నంలో బహిరంగ సభలు నిర్వహించి, 4న పెడనలో మరో సభ నిర్వహిస్తామని, అక్టోబర్ 5న కైకలూరు వరకు యాత్ర సాగుతుందన్నారు. ఈ దశలో చేనేత కార్మికులు, హస్తకళలపై ఆధారపడి జీవిస్తున్న వారితో సమావేశమై వారి సమస్యలను పవన్ కళ్యాణ్ తెలుసుకోనున్నారు.

# పారిశ్రామికవేత్తలకు అన్ని విధాలా సాయం

(మొదటిపేజీ తరువాయి)

ఒకటి ఎంఓయూ కూడా ఉంది. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)లో భాగంగా విశాఖపట్నంలో ఆ రోజు పరిశ్రమలు నెలకొల్పేందుకు.. దాదాపు 386 ఎంఓయూలు, రూ.13లక్షల కోట్ల పెట్టుబడులు, దానిద్వారా 6 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. అవన్నీ సాకారం కావాలని.. ప్రతినెలా వాటిని కార్యరూపం దాల్చేలా.. అవి అమలు కావాలన్న ఉద్దేశ్యంతో సీఎస్ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేకమైన కమిటీని కూడా ఏర్పాటు చేసి.. పారిశ్రామిక వేత్తలను చేయిపట్టుకుని నడిపించే కార్యక్రమం చేస్తున్నాం. ఎక్కడ, ఎవరికి ఏ అవసరం ఉన్నా దాన్ని ప్రభుత్వం తన అవసరంగా భావించి.. పారిశ్రామిక వేత్తలను చేయిపట్టుకుని నడిపించి ఆఎంఓయూలను కార్యరూపం దాల్చే విధంగా చేస్తున్నాం. అందులో భాగంగా ఈరోజు ఇటువంటి పరిశ్రమలకు సంబంధించిన 13 శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నాం. ఇందులో 3 యూనిట్లకు ప్రారంభోత్సవాలు, 9 యూనిట్లకు శంకుస్థాపన చేస్తున్నాం. ఒక ఎంఓయూపై సంతకాలు కూడా చేశాం. దాదాపుగా రూ. 3008 కోట్ల పెట్టుబడితో దాదాపు 7వేల మందికి పైగా ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు వచ్చే బృహత్తర కార్యక్రమానికి ఇవాళ శ్రీకారం చుట్టాం. 14 జిల్లాల్లో వస్తున్న ఈ పరిశ్రమల వల్ల సుమారు 7వేల మందికి పైగా అక్కడ ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. 75 శాతం స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని మనం చట్టం కూడా చేశాం. దీనివల్ల మన పిల్లలందరికీ మంచి జరుగుతుంది. అక్కడే వీరికి ఉద్యోగాలు రావడం వల్ల... స్థానికులందరూ ఈ పరిశ్రమల ఏర్పాటుకు మద్దతు పలికి, స్వాగతించే విధంగా మనం ఈ చట్టం చేశాం. వీటివల్ల ఈ పిల్లలకు ఆరునెలల నుంచి గరిష్టంగా 18 నెలలులోగా ఈ పరిశ్రమలలో ఉద్యోగాలు కూడా రానున్నాయి. అప్పటిలోగా ఈ పరిశ్రమలు కూడా ప్రారంభానికి సిద్ధంగా ఉంటాయి. ఇందులో 3 యూనిట్లు ఇప్పటికే ప్రారంభించుకున్నాం. మిగిలిన 9 శంకుస్థాపన చేశాం. ఇవన్నీ కూడా ఆరునెలల నుంచి ఏడాదిన్నరలోనే పూర్తవుతాయి. ఎంఓయూ చేసుకున్న ప్లాంట్ కూడా ఏడాదిన్నరలోగా అందుబాటులోకి రానుంది. ఈ రోజు జరిగిన అన్ని కార్యక్రమాల వల్ల అందరి యాజమాన్యాలకు, ఉద్యోగులు అందరికీ మనసారా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. మీ అందరికీ మద్దతు ఇచ్చే విధంగా.. నాలుగు మాటలు చెబుతాను. మీకు ఏ సమస్య ఉన్నా... మేం మీకు ఒక ఫోన్ కాల్ దూరంలోనే ఉన్నాం. ఈ విషయాన్ని మనసులో పెట్టుకొండి. అధికారయంత్రాంగం మీకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు. అందరికీ మనస్ఫూర్తిగా చెబుతున్నాం. ఈ ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయ, సహకారాలు అందిస్తుంది.

జిల్లాల కలెక్టర్లు, ఏపీఐఐసీ, పరిశ్రమలశాఖ కార్యదర్శి, పరిశ్రమల శాఖ మంత్రి, సీఎస్ సహా అందరూ మిమ్మల్ని చేయిపట్టుకుని నడిపించేందుకు మీ పట్ల సానుకూలంగా ఉన్నాం. ఇంతవరకు కలెక్టర్ నుంచి సీఎస్ వరకూ ఈ పనిలో విశేషంగా కృషి చేసి, వీటిని కార్యరూపం దాల్చేలా చేసినందుకు మనస్ఫూర్తిగా అభినందనలు. పారిశ్రామిక వేత్తల పట్ల అత్యంత సానుకూలంగా ఉన్నాం. మీ అందరికీ మరోక్కసారి అభినందనలు అని సీఎం అన్నారు.

# చంద్రబాబు పిటిషన్లపై విచారణ నేటికి వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

కోర్టు ఎదుట ఉంచామని, చంద్రబాబు పాత్ర ఉందని సీఐడీ గుర్తించిన అన్ని వివరాలను పరిశీలిస్తే అర్థమవుతుందని పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదించారు. చంద్రబాబు గురించి చెప్పడానికి స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో ఇదేమి ఫిక్షన్ స్టోరీ కాదని, కల్పిత పాత్ర కాదని వ్యాఖ్యానించారు. స్కామ్ జరిగిందని ఆధారాలు ఉన్నాయి కాబట్టే మరింత లోతుగా విచారించేందుకు కస్టడీకిఇవ్వాలని, బెయిల్ ఇవ్వొద్దని కోరుతున్నామని పేర్కొన్నారు. చంద్రబాబుకు బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేస్తారని, బెయిల్ ఇవ్వొద్దని, అందువల్ల చంద్రబాబు బెయిల్ పిటిషన్ డిస్మిస్ చేయాలన్నారు. స్కిల్ కుంభకోణం దర్యాప్తు కీలక దశలో ఉంది. దర్యాప్తుకు కీలకంగా ఉన్న దశలో చంద్రబాబుకి బెయిల్ ఇవ్వడం సరికాదని వాదించారు. ఇప్పటికే చంద్రబాబు పీఏ పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ పార్థసాని విదేశాలకు పారిపోవడం వెనుక చంద్రబాబు హస్తం ఉంది. స్కిల్ కుంభకోణంలో రూ.270 కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైంది. డొల్ల కంపెనీల పేరుతో నిధులు దారి మళ్లించారని వాదించారు. చంద్రబాబు బెయిల్, కస్టడీ పిటిషన్లపై న్యాయవాది ప్రమోద్ కుమార్ దూబే వాదనలు వినిపించారు. స్కిల్ కేసులో చంద్రబాబు వైపు ఎలాంటి తప్పిదాలు లేవు. అప్పటి ఆర్థిక శాఖ ఉన్నతాధికారి కే.సునీత గుజరాత్ వెళ్లి అధ్యయనం చేశారు. సునీత అధ్యయనం చేసి ఎలాంటి అభ్యంతరం సీమెన్స్ ప్రాజెక్టుకు తెలపలేదు. సీమెన్స్ ప్రాజెక్టుకు ఎలాంటి అభ్యంతరం లేకుండా కేబినెట్ ఆమోదం పొందిందన్న విషయమై ఆధారాలు ఉన్నాయి. కాస్ట్ ఎవాల్యూయేషన్ కమిటీ స్కిల్ ప్రాజెక్టు ఎక్విప్‌మెంట్ ధరను నిర్ధారించింది. ఆ కమిటీలో చంద్రబాబు లేరు. ఆ కమిటీలో ఉన్న భాస్కరరావు ప్రస్తుతం మధ్యంతర బెయిల్ మీద ఉన్నారు. సుప్రీంకోర్టు నవంబర్ 16వరకు మధ్యంతర బెయిలును పొడిగించింది. చంద్రబాబుకు ఎలాంటి నోటీసివ్వకుండా అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన తర్వాత విచారణ చేపట్టారు. ఆ తర్వాత రెండు రోజుల కస్టడీలోనూ విచారణ చేపట్టారు. ఇప్పుడు మళ్లీ కస్టడీ కావాలంటున్నారు.. అవసరం ఏముందన్నారు. కేబినెట్ ఆమోదం పొందిన తర్వాతే సీమెన్స్ ప్రాజెక్టు అమల్లోకి వచ్చింది. కెబినెట్ నిర్ణయంపై చంద్రబాబు మీద కేసు ఎలా పెడతారని వాదించారు. ఏసీబీ కోర్టులో ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలపై ఒకానొక దశలో న్యాయమూర్తి అభ్యంతరం వ్యక్తం చేశారు. చెప్పిన అంశాలను పదేపదే ఎందుకు చెబుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. నేరానికి సంబంధించిన ఆధారాలు ఉంటే చూపించండి. రిమాండ్ రిపోర్ట్, కస్టడీ పిటిషన్‌ల సమయంలో చెప్పిన వాదనలే మళ్లీ చెబుతున్నారు. ఈడీ దర్యాప్తు చేసిందని, ఇన్‌కమ్ ట్యాక్స్ నోటీసు ఇచ్చిందని గతంలో చాలాసార్లు చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో నిధుల దుర్వినియోగానికి సంబంధించిన ఆధారాలు ఉంటే ఇవ్వండి. చెప్పిందే చెబుతుంటే ఎన్నిసార్లు వింటాం అని సీఐడీ తరపున వాదనలు వినిపిస్తున్న పొన్నవోలు సుధాకర్ రెడ్డిపై జడ్జి అసహనం వ్యక్తం చేశారు. వాదనలు వింటున్న సమయంలో కలగజేసుకుని జడ్జి.. కేబినెట్ నిర్ణయాన్ని చంద్రబాబుకు ఎలా ఆపాదిస్తారని ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డిని ప్రశ్నించారు. కేబినెట్ నిర్ణయం ప్రకారం జీవో ఇచ్చారు.. కానీ జీవోకు వ్యతిరేకంగా ఒప్పందం జరిగిందని పొన్నవోలు బదులిచ్చారు. సోషియో ఎకనామిక్ ఆఫెన్సుల్లో బెయిల్ ఇవ్వొద్దని సుప్రీం తీర్పులున్నాయంటూ ఉదహరించారు. స్కిల్ కేసులో ప్రతి అంశం, ప్రతి తప్పిదం చంద్రబాబు సూచనల మేరకే జరిగిందని పొన్నవోలు వాదించారు. ఈ కేసులో ఏ 37కి డబ్బు ముట్టినట్లుగా ఆధారాలు ఉన్నాయా అని న్యాయమూర్తి ప్రశ్నించారు. చంద్రబాబు జైల్లో ఉండగానే సాక్షుల్ని ప్రభావితం చేస్తున్నారని బెయిల్ ఇస్తే ఇంకా ప్రభావితం చేస్తారని పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదించారు. అయితే జైల్లో ఉన్న వ్యక్తి సాక్షుల్ని ఎలా ప్రబావితం చేస్తారని న్యాయమూర్తి ప్రశ్నించారు. ఏదైనా ప్రభుత్వ స్కీంలో స్కాం జరిగిదే.. హెచ్‌వోడీని బాధ్యుడ్ని చేస్తారా.. ముఖ్యమంత్రిని బాధ్యుడ్ని చేస్తారా అని న్యాయమూర్తి ఏఏజీని ప్రశ్నించారు. ఏఏజీ వాదనలు విన్న తర్వాత విచారణను గురువారానికి వాయిదా వేస్తున్నట్లుగా న్యాయమూర్తి చెప్పారు.

### బాబు అరెస్టు బాధాకరం: మంత్రి తలసాని

హైదరాబాద్, అక్టోబర్ 4 (మనం న్యూస్): మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు చాలా బాధాకరమని తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో చంద్రబాబు నాయకత్వంలో మంత్రిగా పని చేశా. ఆయన అరెస్టు వ్యక్తిగతంగా నాకెంతో బాధను కలిగించింది. ఎవరికీ అధికారం శాశ్వతం కాదు. ఒకప్పుడు దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించిన సీనియర్ నాయకుడు చంద్రబాబు పట్ల వైకాపా ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు విచారకరం. 73 ఏళ్ల ఉన్న చంద్రబాబును అరెస్టు చేయడం, విచారణ పేరుతో ఇబ్బందులకు గురి చేయడం సరికాదు. ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఆయన రాష్ట్రాభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారు అని మంత్రి తలసాని తెలిపారు.

## ప్రతి క్షణం పోరాడతాం

హైదరాబాద్, అక్టోబర్ 4 (మనం న్యూస్): తెలంగాణలో ఎన్నికలు వస్తున్నాయని కొందరు ఇప్పుడు తన తండ్రి ఎన్టీఆర్ జపం మొదలుపెట్టారని హిందూపురం టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో టీటీడీపీ కార్యకర్తలతో బాలకృష్ణ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుపై సినిమా వాళ్లు స్పందించకపోవడాన్ని పట్టించుకోనని స్పష్టం చేశారు. త్వరలో తెలంగాణలో ఎన్నికలు ఉన్నాయి. ఈ ఎన్నికల సమయంలో ఏపీలో జరిగిన పరిణామాలు, చంద్రబాబు హయాంలో చేసిన అభివృద్ధి ఇక్కడ కలిసి వస్తుంది. బాబు నిజాయితీ గురించి అందరికీ తెలిసిందే. రాజకీయ కక్షతోనే ఆయనపై అబద్ధపు కేసులు పెట్టారు. రిమాండ్లోకి తీసుకున్నాక సెక్షన్లు చెబుతున్నారు. ప్రతిఒక్కరూ బాబు అరెస్టుని ఖండిస్తున్నారు. బాబు అరెస్టును మూడు రోజుల నుంచి ఖండిస్తున్నారు. కేవలం ఓట్ల కోసం ఇక్కడ ఎన్టీఆర్ జపం చేస్తున్నారు. ఇంతకాలం తెలంగాణలో టీడీపీ అజ్ఞాతంలో ఉంది.. ఇప్పుడు మళ్లీ చైతన్యం వస్తోంది. రాజకీయ లబ్ధి కోసం కాకుండా తెలుగు వారి గౌరవం కోసం పని చేద్దాం. తెలంగాణలో టైం వచ్చింది.. కేసులకు అరెస్టులకు భయపడం. న్యాయవ్యవస్థపై మాకు నమ్మకం ఉంది. ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుంటాం. ఐటీ ఉద్యోగులు హైదరాబాద్‌లో ఉద్రిక్త సృష్టిస్తున్నారని అనడం సరి కాదు. తెలంగాణ ఎన్నికల్లో పూర్తి స్థాయిలో పోరాడాలని నిర్ణయించుకున్నాం. ఇప్పుడు టైం వచ్చింది. తప్పకుండా టీడీపీ జెండా తెలంగాణలో రెపరెపలాడుతుంది. తెలంగాణలో అంతా మసిపూసి మారెడుకాయ చేస్తున్నారు. పార్టీ పునర్వైభవానికి ప్రతి క్షణం పోరాడతాం. పొత్తుల గురించి చంద్రబాబు నిర్ణయిస్తారు. తెలంగాణలో టీడీపీ లేదు అన్న వారికి మెమెంటో చూపిస్తాం

**కేంద్రం హస్తం ఉందో లేదో అవగాహన లేదు**

ఏపీలో ఒక సైకో పరిపాలన నడుస్తుంది. ప్రజా సంక్షేమం గాలికి వదిలి ప్రతిపక్ష నాయకులను ఇబ్బంది పెట్టే రాజకీయం అక్కడ నడుస్తుంది. 17ఏ లేకుండా చంద్రబాబును ఎలా అరెస్టు చేశారు అనేదే ప్రశ్న. మాకు ఈ విషయంలో కేంద్రం హస్తం ఉందో లేదో అవగాహన లేదు. అనవసరంగా ఎవరిపైనా మేము నిందలు వేయం. కేంద్రం కల్పించుకోవాల్సిన అవసరం ఉన్న సమయంలో వారు మాట్లాడకపోవడం వారి విజ్ఞతకే వదిలేయాలి. బీజేపీ అధ్యక్షురాలిగా మా అక్క పురందేశ్వరి ఉన్నారు. ఆమెతో టచ్‌లో ఉన్నాం. తప్పకుండా కేంద్రాన్ని ఈ విషయంపై కలుస్తా. సినిమా వాళ్లు స్పందించక పోవడం కూడా నేను పట్టించుకోను. ఎన్టీఆర్ స్పందించకపోతే ఐ డోంట్ కేర్. రోజా లాంటి వల్ల స్పందనపై మౌనంగా ఉండటమే మేలు. బురద మీద రాయి వేస్తే మన మీదే పడుతుంది అని బాలకృష్ణ పేర్కొన్నారు.

## నేడు విజయవాడకు లోకేశ్

అమరావతి, అక్టోబర్ 4 (మనం న్యూస్): గురువారం ఢిల్లీ నుంచి విజయవాడకు తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ రానున్నారు. రాజమండ్రి జైలులో చంద్రబాబునాయుడుతో లోకేశ్ ములాఖత్ అవుతారు. సుప్రీంకోర్ట్‌లో చంద్రబాబు పిటీషన్‌పై 9వ తేదీన విచారణ జరగనున్నది. సుప్రీంకోర్ట్‌లో చంద్రబాబు స్పెషల్ లీవ్ పిటీషన్‌పై విచారణ సమయానికి మళ్లీ తిరిగి ఢిల్లీ రావాలని లోకేశ్ నిర్ణయం తీసుకున్నారు. ఇదిలావుంటే యువగళం పాదయాత్ర త్వరలో నారా లోకేశ్ తిరిగి ప్రారంభిస్తారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తెలిపారు. ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. నారా లోకేశ్ ఢిల్లీ నుంచి రాజమండ్రి లేదా విజయవాడ రానున్నారని తెలిపారు. రెండు రోజుల్లో జనసేనతో పాటు కలిసి పని చేసే కమిటీ సభ్యుల పేర్లు ప్రకటించే యోచనలో ఉన్నట్లు తెలిపారు. అలాగే వచ్చే సోమవారం వరకూ చంద్రబాబుకు మద్దతుగా రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అంతేకాకుండా చంద్రబాబు అక్రమ అరెస్ట్‌ను తట్టుకోలేక చనిపోయిన వారి కుటుంబాలను భువనేశ్వరి పరామర్శిస్తారని అచ్చెన్నాయుడు వెల్లడించారు.

# లోకేశ్‌ను అరెస్ట్ చేయొద్దు

అమరావతి, అక్టోబర్ 4 (మనం న్యూస్): ఏపీ స్కిల్ డెవలప్మెంట్ స్కాం కేసులో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ ముందస్తు బెయిల్ను ఈ నెల 12 వరకు ఎపి హైకోర్టు పొడిగించింది. హైకోర్టులో బుధవారం నారా లోకేష్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణకు వచ్చింది. ఈ క్రమంలోనే లోకేష్ ముందస్తు బెయిల్ బుధవారంతో ముగుస్తుందని ఆయన తరపు న్యాయవాదులు చెప్పారు. మరోవైపు తనకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు లేవని సిఐడి తరపున అడ్వకేట్ జనరల్ శ్రీరామ్ సుబ్రహ్మణ్యం హైకోర్టుకు తెలిపారు. ఈ క్రమంలోనే లోకేష్ పిటిష్న విచారణను హైకోర్టు ఈ నెల 12కు వాయిదా వేసింది. అప్పటివరకు లోకేశ్‌ను అరెస్ట్ చేయవద్దని, ముందస్తు బెయిల్ పొడిగిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇక, స్కిల్ డెవలప్మెంట్ స్కామ్‌లో టిడిపి అధినేత చంద్రబాబును సిఐడి అరెస్ట్ చేసిన సంగతి విదితమే. ఈ కేసులో చంద్రబాబు ప్రస్తుతం రాజమండ్రి జైలులో జ్యూడిషియల్ రిమాండ్‌లో ఉన్నారు. ఈ కేసులో లోకేష్ పాత్రపై కూడా దర్యాప్తు జరుపుతామని సిఐడి ఇప్పటికే ప్రకటించిన సంగతి విదితమే. ఈ క్రమంలోనే లోకేష్ ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. అయితే లోకేష్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై గత విచారణ సందర్భంగా లోకేశ్‌ను ఇంకా నిందితుడిగా పేర్కొనలేదని సిఐడి హైకోర్టుకు తెలిపింది. ఈ కేసులో తాను నిందితుడిని కాదని లోకేష్ చెబుతున్నందున ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఎలాంటి అర్హత లేదని సిఐడి తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. ఈ క్రమంలోనే స్కిల్ డెవలప్మెంట్ స్కామ్ కేసులో నారా లోకేశ్‌ను అక్టోబర్ 4వ తేదీ వరకు అరెస్ట్ చేయకుండా సిఐడి పోలీసులను హైకోర్టు ఆదేశించింది.

# జిల్లాలో ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలు వచ్చాయి

- అక్టోబర్ 5 నుండి ఈవిఎం ల అక్సెప్టేన్సీ, 14 వ తేది నుండి పరిశీలన జరుగుతాయి : జిల్లా కలెక్టర్

చిత్తూరు, అక్టోబర్ 4, మనం న్యూస్: జిల్లాకు ఐదు వేల ఈవీఎంలు రావడం జరిగిందని, అక్టోబర్ 5 నుండి సంబంధిత ఇంజనీర్ల ముందు ఈ వి ఎంల యాక్సెప్టెన్సీ, 14వ తేది నుండి ఈవీఎంల పరిశీలన జరుగుతుందని జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి అన్నారు. బుధవారం ఉదయం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల నమోదుకు పలువురు దరఖాస్తులు చేసుకోవడం జరుగుతుందని అయితే చిరునామాలు సక్రమంగా ఉండడంలేదని పరిశీలన చేయడం జరుగుతుందని అన్నారు. జిల్లాకు సంబంధించి ఇప్పటి వరకు ఐదువేల ఈవీఎంలు రావడం జరిగిందని, ఇంజనీర్ల సమక్షంలో గురువారం అక్సెప్టేన్సి నుంచి పరీక్ష నిర్వహిస్తారని, అనంతరం ఈనెల 14 నుంచి ఈవీఎంల పరిశీలన కార్యక్రమం పార్టీ ప్రతినిధుల సమక్షంలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మరో వారంలో రెవెన్యూ అధికారులకు ఎన్నికల ప్రక్రియకు సంబంధించి అవగాహన కోసం వర్క్ షాప్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఓటరు నమోదు, తీసి వేతకు సంబంధించి బల్క్ గా దరఖాస్తులను సమర్పించరాదని అన్నారు. డి ఆర్ ఓ ఎన్. రాజశేఖర్ మాట్లాడుతూ ప్రత్యేక పోలింగ్ కేంద్రం నిమిత్తం ఎటువంటి దరఖాస్తులు అందలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తరపున గంగరాజు, సిపిఐ తరపున గోపి, బిజెపి నుంచి అట్లూరి శ్రీనివాసులు, వైఎస్ఆర్సిపి నుంచి మహేంద్ర, ఎన్నికల డిటిలు తదితరులు హాజరయ్యారు.



## భవ్య శ్రీ కుటుంబానికి రూ.25 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలి

- నిందితులను కఠినంగా శిక్షించాలి
- పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు
- రూ.25,000 ఆర్థిక సహాయం అందజేత



చిత్తూరు, అక్టోబర్ 4, మనం న్యూస్: జిల్లా పెనుమూరు మండలం వేణుగోపాలపురం గ్రామంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వెనుకబడిన వర్గాలకు చెందిన బాలిక భవ్య శ్రీ కుటుంబానికి న్యాయం చేయాలని పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు డిమాండ్ చేశారు. వేణుగోపాలపురంలోని బాధిత కుటుంబాన్ని ఏఐసీసీ కార్యదర్శి, ఏపీ వ్యవహారాల ఇన్చార్జ్ సీడీ. మయప్పన్ తో కలిసి బుధవారం గిడుగు రుద్రరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబీకుల నుంచి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సెప్టెంబర్ 17వ తేది రాత్రి ఇంటి నుంచి వెళ్లి కనబడకుండా పోయిన భవ్యశ్రీ 20వ తేది బావిలో శవంగా కనిపించిందని వారు వివరించారు. గ్రామానికి చెందిన నలుగురు యువకులపై తమకు అనుమానం ఉందని, వారే తమ కుమార్తెపై అఘాయిత్యం చేసి గుండు కొట్టించి చంపేశారని కాంగ్రెస్ ముఖ్య నేతల వద్ద, బాధిత కుటుంబీకులు తమ ఆవేదనను వెలిబుచ్చారు. భవ్యశ్రీ కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చిన పీసీసీ అ. ధ్యక్షులు గిడుగు రుద్రరాజు, కాంగ్రెస్ పార్టీ తరుపున వారికి రూ.25,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

**రూ.25 లక్షలు నష్ట పరిహారం అందజేయాలి**

భవ్య శ్రీ కుటుంబ సభ్యులను పరామర్శించిన తరువాత పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు మీడియాతో మాట్లాడుతూ., చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం, వేణుగోపాలపురం గ్రామంలో జరిగిన బీసీ వర్గానికి చెందిన బాలిక భవ్య శ్రీ అనుమానాస్పద మృతిపై వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. బాధిత కుటుంబీకులకు రూ.25 లక్షలు నష్ట పరిహారం అందజేయాలని, వారిని అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా వెంటనే ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ఏర్పాటు చేసి నిందితులకు కఠిన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు, వెనుకబడిన వర్గాలపై దాడులు పెరిగాయని ఈ సందర్భంగా ఆయన విమర్శించారు. కార్యక్రమంలో కార్యనిర్వహక అధ్యక్షుడు జంగా గౌతమ్, పీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షులు సాకే శంకర్తో పాటు చిత్తూరు జిల్లా స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్షకి వైయస్సార్ పార్టీ నాయకులు దూరం?

- బీసీలు అంటే నాయకులకు అంత హీనమా.!
- ప్రభుత్వ కార్యక్రమాలకునాయకులు రాకపోవడం



బంగారుపాళ్యం, అక్టోబర్ 4, మనం న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి బుధవారం బంగారుపాలెం మండలంలోని బోడబండ్ల గ్రామపంచాయతీ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి బంగారుపాలెం నాయకులు రాకపోవడం గ్రామంలోని కొంతమంది వైఎస్ఆర్ పార్టీ నాయకులు బాధపడుతూ ఉన్నారు. ఇందులో రెండవ రోజు జగనన్న ఆరోగ్య సురక్షిత కార్యక్రమాన్ని హైస్కూల్లో నిర్వ హించిన క్రమంలో ఏ నాయకుడు రాకపోవడం బాధగా ఉందని ఆగ్రామములో కొంతమంది వైఎస్ఆర్ పార్టీ నాయకులు వాము పోతున్నారు. ఇందులో భాగముగా ఎలక్షన్ పడితే మాత్రం ఇంటింటికి నాయకులు తిరిగి ఓట్లు వేయమని అడిగేవారు. ప్రభుత్వ కార్యక్రమానికి నాయకులు దూరం దూరం అని తెలుపుతున్నారా?. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా మంత్రులు జిల్లా అధికారులు బీసీలు మీటింగులు పెడితే నాయకులు మాత్రం కొంత మంది రాకపోవడం దారుణంగా బాధాకరంగా ఉందని కొంతమంది వైఎ స్ఆర్ పార్టీని అంటున్నారు. ఏ సమస్య వచ్చినా ఏ మీటింగ్ పెట్టిన నా యకులు హాజరుకావాలని బోడబండ్ల గ్రామపంచాయతీ పరిధిలో వైఎస్ ఆర్ నాయకులు తిడుతున్నారు. ఈ కార్యక్రమంలో పలు వైయస్సార్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రీ సర్వే పనులు వేగవంతం చేయాలి

- క్షేత్ర స్థాయిలో పనులను పరిశీలిస్తూ ఎక్కడా పెండింగ్ లేకుండా చూడాలి : సిసిఎల్ఏ కార్యదర్శి
- జిల్లాలో రీ సర్వే పనులలో రెండు దశలు పూర్తి అయ్యాయి
- క్షేత్ర స్థాయిలో పనులను పరిశీలించడం, రికార్డులను ఎప్పటి కప్పుడు పర్యవేక్షణ చేయడం జరుగుతోంది : జాయింట్ కలెక్టర్



చిత్తూరు,అక్టోబరు 4, మనం న్యూస్ : రీ సర్వే పనులు వేగవంతం చేయడానికి సమీక్ష లు నిర్వహిస్తూ క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలని ఏ స్థాయిలోనూ పెండింగ్ లేకుండా చూడాలని సిసిఎల్ఏ కమిషనర్ సిద్ధార్థ జైన్ అన్నారు. బుధవారం విజయవాడ నుండి రీ సర్వే పురోగతి పై వీడియో కాన్ఫరెన్స్‌ను సిసిఎల్ఏ కమిషనర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రీ సర్వే పనులలో రెండు దశలు పూర్తి అయ్యాయనీ మూడవ దశకు సంబంధించిన పనులు వేగవంతం చేయాలని అన్నారు. అదేవిధంగా పారదర్శకంగా పనులు జరిగేందుకు సమీక్షలు నిర్వహిస్తూ క్షేత్ర స్థాయిలో పనులనుపరిశీలిస్తూ ఏ స్థాయిలోనూ పెండింగ్ లేకుండా చూడాలని అన్నారు. జిల్లాలో మొదటి దశలో 132, రెండవ దశలో 91 గ్రామాలకు సంభందించి పనులు పూర్తి అయ్యా యని, మూడ వదశలో పనులు106 గ్రామాలలో వివిధ దశలలో పనులు జరుగు తున్నాయని క్షేత్ర స్థాయి పర్యటనలతో పాటు రోజువారీ పనులను పర్య వేక్షిస్తూ వేగవంతంగా పనులు చేస్తున్నారని జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు వివరించారు.

# కలిసికట్టుగా నగరాన్ని అభివృద్ధి చేసుకుందాం

- మేయర్ ఎస్. అముద





చిత్తూరు,అక్టోబర్ 4, మనం న్యూస్ : సభ్యులంతా కలిసికట్టుగా పని చేసి చిత్తూరు నగరాన్ని అభివృద్ధి చేసుకుందామని నగర మేయర్ ఎస్ అముద పిలుపునిచ్చారు. చిత్తూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం మేయర్ ఎస్ అముద అధ్యక్షతన జరిగింది. ఎక్స్ అఫిషియో సభ్యుల హోదాలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగర కమిషనర్ డా. జె అరుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. చిత్తూరు నగరపాలక సంస్థ అభివృద్ధికి సభ్యులంతా ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు.ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ... నగరంలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయని, ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మిగిలిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా మంజూరు చేసిన నిధులకు సంబంధించిన పనులను చేపట్టాలన్నారు. ఇదే సమయంలో అత్యధిక ప్రాధాన్యత ఉన్న కట్టమంచి బైపాస్ రోడ్డు, చవటపల్లి రోడ్డు, కొంగారెడ్డిపల్లిలో మేజర్ డ్రైనేజీ నిర్మాణానికి సత్రం చర్యలు ప్రారంభించాలన్నారు. నగర కమిషనర్ డా. జె అరుణ మాట్లాడుతూ... గడ పగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అన్ని వార్డుల్లో చెపట్టిన పనులకు సంబంధించిన వివరాలను సభ్యులకు అందించడం జరుగుతుందన్నారు.సమావేశంలో భాగంగా అజెండా అంశాలపై సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. నగరపాలక సంస్థ పరిధిలో కట్టమంచి వై జంక్షన్ నుండి సాంబయ్య కండిగ పుత్తూరు రోడ్డు వరకు రోడ్డును అభివృద్ధి చేయుటకు రూ.3.95కోట్లు కేటాయించడం, సంతపేట దుర్గమ్మ గుడి నుండి చౌటపల్లి మీదుగా జాతీయ రహదారి బైపాస్ రోడ్డు వరకు రోడ్డు అభివృద్ధి కోసం రూ.1.79 కోట్లు కేటాయించడం, కొంగారెడ్డిపల్లి మెయిన్ రోడ్డులో మేజర్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.85 లక్షలు కేటాయించడానికి ఆమోదించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్లు ఆర్ చంద్రశేఖర్, రాజేష్ కుమార్ రెడ్డి, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, నగర పాలక అధికారులు పాల్గొన్నారు.

## ప్రారంభోత్సవానికి ఇండోర్ స్టేడియాన్ని సిద్ధం చేయండి

- కమిషనర్ హరిత ఐఏఎస్



తిరుపతి, అక్టోబర్ 4, మనం న్యూస్: స్మార్ట్ సిటీ నిధులతో నిర్మించిన ఇండోర్ స్టేడియంలో అన్ని పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీమతి హరిత ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి వినాయక సాగర్ వద్ద నిర్మిస్తున్న మార్కెట్ గదులు, ఇందిరా మైదానం వద్ద నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇండోర్ స్టేడియం పనులు ఆలస్యంగా చేస్తున్నారని, పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. అన్ని పనులు పూర్తి అయినా చిన్నచిన్న పనుల్లో ఆలస్యం చేయకుండా పనులు ఈ నెలాఖరు లోపు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. ఈ ఇండోర్ స్టేడియంలో షటిల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, జిమ్, తదితర క్రీడా కోర్టులు ఉంటాయి. వినాయక సాగర్ సమీపంలోని ట్రాన్స్ఫర్ స్టేషన్ వద్ద నిర్మిస్తున్న మార్కెట్ గదుల నిర్మాణ పనులు పరిశీలించారు. ప్లాన్ ప్రకారం ఒక్క ఫ్లోర్ అయినా స్లాబ్ వేసి గదులను నిర్మించాలని అన్నారు. అన్ని పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డి. ఈ. విజయకుమార్ రెడ్డి, ఏ ఈ కామ్ ప్రతినిధి అనిల్ తదితరులు ఉన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకి శ్రీరామరక్ష

- ఎంపీపీ భాస్కర్ రెడ్డి



సోమల, అక్టోబర్ 4, మనం న్యూస్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వై. ఎస్. జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించి, అమలుచేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష రాష్ట్ర ప్రజలకి శ్రీరామరక్ష అని జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో రాష్ట్ర ప్రజలకి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధ్యంమవుతుందని ఎంపీపీ భాస్కర్ రెడ్డి అన్నారు. పుంగనూరు మండల రూరల్ పరి .ది లో బోడేవారిపల్లి గ్రామ పంచాయతీ బోడేవారిపల్లి గ్రామ సచివాలయం నందు బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష చాలా అద్భుతమైన కార్యక్రమమని, దేశంలో ఎవరికి రాని గొప్ప ఆలోచన సీఎంతో సాధ్యమైనదని తెలిపారు.ప్రతి కుటుంబం నిండు ఆరోగ్యంగా ఉండాలని పెద్ద ఎత్తున వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి ఈ రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్గా మార్చాలని జగన్మోహన్ రెడ్డి గారు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ అమరనాథ్ రెడ్డి, పుంగనూరు రూరల్ వైస్సార్సీపీ అధ్యక్షుడు చెంగారెడ్డి సీనీయర్ నాయకులు నాగరాజారెడ్డి తహశీల్దార్ సీతారాం ఎంపీడీఓ నారాయణ వైస్సార్సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లబాల చంద్రారెడ్డియాదవ్, ఆర్టీసీ మాజుద్దార్ యూనియన్ అధ్యక్షుడు జయరామిరెడ్డి, సర్పంచులు ,ఎంపీటీసీలు,ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, డాక్టర్లు అధికారులు, గ్రామ వాలంటీర్లు, వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యానికి రక్ష



కురబలకోట, అక్టోబర్ 4, మనం న్యూస్ : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పైసా ఖర్చులేకుండా ప్రజల వద్దకే వచ్చిన మెరుగైన వైద్య సేవలను వినియోగించుకుని ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిపీ బి. దస్తగిరి కోరారు. బుధవారం చింతమాకులపల్లె గ్రామ ఇన్చార్జి నార్లపల్లె కోళ్ల వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో సచివాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల వారు వైద్య పరీక్షలు, సేవలు పొందారు. ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి వారికి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారన్నారు. ప్రజల ఆరోగ్యానికి రక్షగా నిలుస్తోందన్నారు. తహశీల్దారు ఎం. భీమేశ్వరరావు, లక్ష్మీపతి, దిలిప్ కుమార్, ఆనంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక స్వామి సన్నిధిలో చైర్మన్ శైలజా చరణ్ రెడ్డి

కాణిపాకం, అక్టోబర్ 4, మనం న్యూస్ : శ్రీ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా రాయలసీమ స్త్రీ శిశు సంక్షేమ శాఖ రీజనల్ చైర్మన్ శైలజ చరణ్ రెడ్డి, స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించడం జరిగింది, స్వామివారిని దర్శించుకుని వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేసిన సూపరింటెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాబు, ఆలయ ఉభయదారులు, తదితరులు ఉన్నారు.



## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం



కుప్పం, అక్టోబర్ 4, మనం న్యూస్ : గుడుపల్లి మండలం సంగనపల్లి గ్రామ పంచాయతీ, బురుగుల్లపల్లి గ్రామంలో మాజీ వైస్ సర్పంచ్ క్రిష్ణప్ప మృతి చెందడంతో అయన దహన సంస్కారాలకు 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం ఎమ్మెల్సీ. భరత్ సహాయంతో వాళ్ల కుటుంబ సభ్యులకు అందజేసిన సంగనపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ అమర్నాథ్ నియోజక వర్గ యూత్ అధ్యక్షుడు రవి, మాజీ మార్కెట్ డైరెక్టర్ విశ్వనాథ్ మరియు పంచాయతీ నాయకులు పాల్గొన్నారు

## అమ్మ పలుకు జగదాంబ పలుకు లేవండి

- దొర లేవండి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేస్తే ఈ రాష్ట్రంను వదిలి వెళ్ళాలి
- మండల పార్టీ అధ్యక్షులు ప్రేమకుమార్



కుప్పం, అక్టోబర్ 4, మనం న్యూస్ : అమ్మపలుకు– జగదాంబపలుకు లేవండి దొరా! లేవండి, ఈరాష్ట్రానికి 5ఏళ్ల శని పట్టింది, ఖర్మకాలి ఈసారి మీ ఇంట్లో వుండే ఫ్యాన్ గుర్తు కు ఓటు వేసారంటే, తలమీదతెల్లగుడ్డ వేసుకొని, తట్టా, బుట్టా సర్దుకొని, ఉన్న ఈ ఇంటిని, తరాలుగా వస్తున్న మీ ఆస్థిని, ఈ ఊరును వదిలేసి, ఆకరికి ఈరాష్ట్రాన్ని కూడా వదిలిపెట్టి పారిపోవాల్సిన పరిస్థితివస్తుంది, ఇది సత్యం,అమ్మ పలుకు జగదాంబ పలుకు, దీనికి పరిష్కారం, విరుగుడు మీ చేతిలోనే ఉంది, మీరు, మీ బంధువులు, ఈ ఊరు అంతాఏకం అవ్వాలి, అందరూ కలిసి మళ్లీ ముఖ్యమంత్రిగా నారాచంద్రబాబు నాయుడు గారిని గెలిపిస్తే గాని, మీకు, మీ బిడ్డలకు, ఈఊరికి, ఈరాష్ట్రానికి భవిష్యత్తు ఉండదు,ఇది ముక్కోటిదేవతలు,అల్లా, ఏసుప్రభువుల ఆజ్ఞ, అమ్మ పలుకు, జగదాంబ పలుకు,మీ తలరాతను మీరే మార్చుకోండి. అంటూ మండల పార్టీ అధ్యక్షులు ప్రేమకుమార్ బుడబుక్కల వేషదారణలో ప్రజలకుతెలియ జేయడమైనది.

## వినాయక స్వామి ఆలయానికి రెండున్నర టన్నుల కూరగాయలు విరాళం



కాణిపాకం, అక్టోబర్ 4, మనం న్యూస్ : కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి శాంతిపురం జడ్పిటిసి శ్రీనివాస్ రెండున్నర టన్నుల కూరగాయలను వితరణగా సమర్పించారు గతంలో తిరుమల తిరుపతి దేవస్థానానికి అన్నదానాన్ని కూడా కూరగాయలు వితరణ చేసే వారిని చెప్పారు అదేవిధంగా గత రెండు సంవత్సరాలుగా కాణిపాకం దేవస్థానానికి కూడా కూరగాయలు వితరణగా అందిస్తున్నట్లు తెలిపారు తాను పండించిన కూరగాయలతో పాటు రైతుల వద్ద సేకరించిన కూరగాయలను ఆలయానికి తీసుకువచ్చి అన్నదానం సముదాయంలో అందజేశారు ఈ కార్యక్రమానికి నిర్వహించడం పట్ల వైఎస్ఆర్సిపి నాయకులు చిన్నారెడ్డి ఎంపీటీసీ సుదీర్ బాబు హర్షం వ్యక్తం చేశారు

## స్కూల్ గేమ్స్ షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపికలు

కుప్పం, అక్టోబర్ 4, మనం న్యూస్ : కుప్పం మండలం చందం పంచాయతీకి సంబంధించి కొత్త యిండ్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో క్రీడా మైదానంలో 7 వతేది అండర్ 17 బాల బాలికల జిల్లా జట్లు ఎంపిక చేయునట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపికలు ప్రధాన ఉపాధ్యాయుడు వి.మార్కొండ నాయుడు వ్యాయామ దర్శకుడు ఎం లోకనాథం మరియు ఉపాధ్యాయ బృందం తెలిపారు. ఉదయం 9 గంటలకు ఈ ఎంపికలు జరుగుతుందని అన్నమయ్య, చిత్తూరు ,తిరుపతి జిల్లాల అర్హులైన క్రీడాకారులు హాజరుకావాలని వారు కోరారు. వివరాలకు 7989 811005 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని వారు తెలిపారు.

## రాళ్ళబూదుగూరు పంచాయతీలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ



శాంతిపురం, అక్టోబర్ 4, మనం న్యూస్: శాంతిపురం మండల పరిధిలోని రాళ్ళబూదుగూరు పంచాయతీ సచివాలయ ఆవరణంలో సర్పంచ్ లక్ష్మి మురుగేష్ అధ్యక్షతన 2023-24 సంవత్సరం కు గాను గ్రామసభ సమావేశము నిర్వహించారు. ఈ గ్రామసభ సమావేశంలో గ్రామపంచాయతీ లోని బడుగు బలహీన వర్గాల జీవనోపాధి, గ్రామ అభివృద్ధి, స్వచ్ఛభారత్, నవరత్నాలు, ఉపాధి హామీ మరియు పలు అంశాలపై అధికారులు నాయకులు సభకు విచ్చేసి నటువంటి ప్రజలకు వివరించారు. గ్రామసభ యొక్క ముఖ్య ఉద్దేశం మరియు ప్రజలకు ప్రభుత్వం అందించే సేవలు సదుపాయాలు మరియు గ్రామం పట్ల, గ్రామ అభివృద్ధి పట్ల ప్రజల యొక్క బాధ్యతలు గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వనిత,గ్రామ ఉపసర్పంచ్ వెంకటరమణ,వైసీపీ నేత రమేష్, ఏపీఎం గ్రీటా, ఉపాధి హామీ ఏఈ వందన,సచివాలయ సిబ్బంది గ్రామ వాలంటీర్లు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష పథకాన్ని ప్రారంభించిన బియ్యం పవిత్ర రెడ్డి



శ్రీకాళహస్తి రూరల్, అక్టోబర్ 4, మనం న్యూస్ : శ్రీకాళహస్తి మండలం బివి పురంలో బుధవారం ఆరోగ్య సురక్ష పథకాన్ని బియ్యపు పవిత్రా రెడ్డి ప్రారంభించారు. సురక్ష పథకంలో ఎలాంటి వైద్య సేవలు ప్రజలుకు అందిస్తున్నారని వైద్యులను ఆమె అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందించాలని కోరారు. వైద్య సేవలను మారుమూల గ్రామాలకు చేరవేయాలని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతులుగా జీవించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జడ్పిటిసి రెడ్డి, భానుమూర్తి, సర్పంచ్ చంద్రబాబు. సురేంద్ర యాదవ్, నాగభూషణ్ యాదవ్,శ్రీనివాసరెడ్డి, రమేష్ యాదవ్, కృష్ణ యాదవ్, శ్రీనివాసులు, రామసుబ్బయ్య,శ్రీనివాసులు, మండల అధికారులు పాల్గొన్నారు.

## బొలెరో ఢీకొని ఇద్దరు రైతులకు తీవ్ర గాయాలు



మదనపల్లి క్రైమ్, అక్టోబర్ 4, మనం న్యూస్: బొలెరో వాహనం ఢీకొని ఇద్దరు రైతులు తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం రామసముద్రం మండలంలో జరిగిన ఘటనపై బాధితుల కుటుంబీకులు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... రామసముద్రం మండలంచెంబకూరు పంచాయతీ, ఎగువపల్లికి చెందిన రైతులు గణేష్ (60), రామూర్తి (45) సొంత పనిమీద ద్విచక్ర వాహనంలో చెంబకూరుకు బయలుదేరారు. మార్గమధ్యంలోని చెంబకూరు వద్ద ఎదురుగా వస్తున్న బొలోరో వాహనం రైతులు ప్రయాణిస్తున్న బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు రైతులు తీవ్ర గాయాల పాలయ్యారు. కుటుంబ సభ్యులు వారిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం వైద్యులు వారికి మెరుగైన వైద్య చికిత్సలు అందించి పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. కేసు దర్యాప్తులో ఉందని రామసముద్రం ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

## హార్సిలీ హిల్స్ వద్ద రోడ్డు ప్రమాదం

- బైకును ఢీకొన్న కారు
- మిట్స్ విద్యార్థులకు తీవ్ర గాయాలు



మదనపల్లి క్రైమ్, అక్టోబర్ 4, మనం న్యూస్ : ప్రముఖ పర్యాటక కేంద్రం బి. కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అంగళ్ళు మిట్స్ కళాశాలలో చదువుతున్న నలుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనకు సంబంధించి బి. కొత్తకోట పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. కురబలకోట మండలం అంగళ్లు మిట్స్ కళాశాలలో చదువుకుంటున్న నలుగురు విద్యార్థులు ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీ హిల్స్ కు మంగళవారం సాయంత్రం బైకులో వెళ్లారు. చీకటి పడేదాకా అక్కడే ఉండి రాత్రి 10 గంటల సమయంలో తిరిగి అంగళ్లుకు వస్తుండగా మార్గమధ్యంలోని కాండ్లమడుగు క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో విద్యార్థులు జగదీష్, జిలాని, ఖాదర్, మంజులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం హుటాహుటిన 108 వాహనంలో మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. వారిలో మంజు పరిస్థితి విషమంగా ఉండడంతో డాక్టర్లు తిరుపతికి రిఫర్ చేశారు. కేసు దర్యాప్తులో ఉందని పోలీసులు తెలిపారు.

# అర్హత మేరకు ఇల్లు లేని వారికి గృహ వసతి కల్పిస్తాం

- ఉప ముఖ్యమంత్రి
- గృహనిర్మాణాలను వేగవంతం గా చేసుకోవాలి : జిల్లా కలెక్టర్

చిత్తూరు, అక్టోబరు 4, మనం న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వంఅర్హత ఉన్న ఇల్లు లేని వారందరికీ గృహ సౌకర్యం కల్పించాలనే లక్ష్యం తో పనిచేస్తోందని గౌ.రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కే. నారాయణస్వామి అన్నారు. బు.



దవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గంగాధర నెల్లూరు నియోజకవర్గం లో నిర్మిస్తున్న గృహ నిర్మాణాలపై రివ్యూ నిర్వహించారు.



ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ నియోజకవర్గానికి ఎక్కువ సంఖ్యలో గృహాలు మంజూరు కావడం జరిగిందని, అదేవిధంగా నిర్మాణాలు కూడా చేసుకోవడం జరుగుతోందని అయితే కొంతమంది ఇంటి స్థలాలు గృహ నిర్మాణాలుకు అనుమతి కావాలని కోరడం జరుగుతోందని అన్నారు. క్షేత్రస్థాయిలో కాలనీల వారీగా ఇంకా ఖాళీగా ఉన్న స్థలాలతోపాటు మరిన్ని మంజూరు లు కావాలని, ఇంటి పట్టాలు గృహ నిర్మాణాలు అవసరమైన వారిని గుర్తించాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ మాట్లాడుతూ గృహ నిర్మాణాలలో గంగాధర్ నెల్లూరు నియోజకవర్గంలో భారీగా జరుగుతున్నాయని అదే స్థాయిలో పూర్తి చేయడం కూడా జరిగిందని అయితే ప్రభుత్వ ఆశయం మేరకు అ



ర్హత వున్న వారికి ఇల్లులు ఇవ్వడం జరుగుతుందని ఇంకా మంజూరు కాని వారిని గుర్తించడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా అన్ని మండలాలలోనూ ఇంటి పట్టాలు ఇవ్వడంతో పాటు గృహ నిర్మాణాలకు అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని ఇల్లు మంజూరు ఇవ్వడం జరుగుతుందని ఇందులో భాగంగా గంగాధర్ నెల్లూరు నియోజకవర్గానికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. భూసేకరణ గురించి తహసీల్దారులకు ఆదేశాలు జారీ చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, హౌసింగ్ అధికారులు వెంకటేశ్వర్లు శంకరప్పలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## మండల స్థాయిలోనే ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ నిర్ణయం

- ప్రతి శుక్రవారం మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమ నిర్వహణ
- జిల్లా స్థాయి అధికారులు మొదలు ప్రత్యేక అధికారులు, సంబంధిత మండల స్థాయి, గ్రామస్థాయి అధికారుల వరకు హాజరు
- ఈ నెల 6 న యాదమరి మండల కేంద్రం ఎంపిడిఓ కార్యాలయంలో మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమ నిర్వహణ : జిల్లా కలెక్టర్



చిత్తూరు, అక్టోబర్ 4, మనం న్యూస్ : జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా మండల స్థాయిలోనే ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని జిల్లా కలెక్టర్ ఎస్. షణ్మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రతి మాసంలో ప్రతి శుక్రవారం ఒక మండలంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు ఖచ్చితంగా పాల్గొన్నాలని, ఈ కార్యక్రమ నిర్వహణకు, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతున్నదని తెలిపారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా స్థాయి అధికారులు మొదలు ప్రత్యేక అధికారులు, మండల, గ్రామ స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు వరకు సంబంధిత మండలంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగస్వాములు కావడం ద్వారా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు అవకాశాలు ఎక్కువ ఉంటాయని తెలిపారు. అక్టోబర్ మాసంలో జరిగే జగనన్నకు చెబుదాం కార్యక్రమ వివరాలు. 06-10-2023న పూతలపట్టు నియోజకవర్గం యాదమరి మండల కేంద్రం 13-10-2023న పుంగనూరు నియోజకవర్గం సదుం మండల కేంద్రం 20-10-2023న కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండల కేంద్రం 27-10-2023న పలమనేరు నియోజకవర్గం గంగవరం మండల కేంద్రం.

# మేం తిరగబడితే.. మీరు తట్టుకోలేరు..!

- అక్రమ కేసులుతో అణచాలని చూస్తే తిరుగుబాటే
- అక్రమాలు వద్దు, అభివృద్ధి చేయండంటూ చెవన్నకు హితువు
- తెలుగుదేశం పార్టీ గెలుపు తథ్యం
- ఎమ్మెల్యేగా పులివర్తి నానికి ఒక్క ఛాన్స్ ఇవ్వండంటూ పులివర్తి సుధారెడ్డి అభ్యర్థన



చిన్నగొట్టిగల్లు, అక్టోబర్ 4, మనం న్యూస్ : తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి అణిచివేయాలని చూస్తే మాత్రం తిరుగుబాటు తప్పదని, మేం తిరగబడితే మీరు తట్టుకోలేరని చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు. బుధవారం ఎర్రవారి పాలెం మండలంలోని చింతగుంట పంచాయతిలో డైనమిక్ లీడర్ పులివర్తి సుధా రెడ్డి స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి కార్యకర్తలపై, ఎర్రచందనం, గంజాయి, మద్యం వంటి అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని బెదిరించడాన్ని బట్టి చూస్తే,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల గుండెల్లో ఉన్న భయం ఎంతుందో చెప్పచ్చునన్నారు. ఏ ఒక్క తెలుగుదేశం పార్టీ కార్యకర్త పైన అయినా సరే అక్రమ కేసులు బనాయించాలని చూస్తే మాత్రం వ్యవస్థలపై తిరుగుబాటు తప్పదని ఆమె ఘాటుగా హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీలో ఎర్రచందనం దొంగలు ఎవరూ లేరని, అలా ఉన్నవాళ్లంతా అధికార పార్టీకి చెందిన వాళ్లేనని తేల్చడానికి కూడా ఇక ఎక్కువ సమయం లేదులేనన్నారు.చింతగుంట పంచాయతిలోని ఆదిఆంధ్ర వాడ కాలనీవాసులకు వీధి దీపాలులేక,త్రాగునీటి సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నారని వాటిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని కోరారు.ఎవరు ఎన్ని అడ్డంకులు పెట్టినా, ఈసారి జరిగే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించడం తధ్యమన్నారు. చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే గా పులివర్తి నానికి ఒక్క అవకాశం ఇవ్వాలంటూ పులివర్తి సుధా రెడ్డి ప్రతి ఒక్కరిని అభ్యర్థించారు. ఈ కార్యక్రమం లో టిడిపి జనసేన మండల అధ్యక్షులు దేశిరెడ్డి రఘునాథ్, మురళి, కార్యదర్శి మహేష్ నాయుడు, మహిళా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, మధు, మునిరత్నం నాయుడు, రాజకుమారి, నాగభూషణం, రమణ, నిరంజన్, అశోక్ రెడ్డి,చిన్నపరెడ్డి,రామచంద్రయ్య,ప్రసాద్ నాయుడు, జగదీష్, వేణుగోపాల్,మనోహర్ నాయుడు, గుర్రప్ప, గురు, కేశవులు నాయుడు రఘు, రాజశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# గడప గడపలో ఆనందం.. ఆత్మీయత..!



రామచంద్రాపురం, అక్టోబర్ 4, మనం న్యూస్: మండలం- పూల వ ర్షం కురిపించిన రాయలచెరువు వాసులు- ఎక్కడి సమస్యకు అక్కడే పరి ష్కారం- గడప గడపకు మన ప్రభుత్వంలో చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి గడప గడపలో ఆత్మీయత.. ఆనందం వెల్లివిరిసింది.. జగనన్న ప్రభుత్వం అం దించే సంక్షేమ పథకాలు ప్రతి గడపలో సంతోషాన్ని నింపడంతో జనం జగనన్నకు జేజేలు పలుకుతున్నారు. చంద్రగిరి నియోజకవర్గం రామచం ద్రాపురం మండలం రాయలచెరువు పంచాయతీ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి నిర్వహిం చారు. గ్రామ శివార్లలో పూల వర్షం కురిపించిన మహిళలు ఘన స్వాగ తం పలికారు. గ్రామంలో ప్రతి గడపలో ఆత్మీయతను పంచుతూ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చేసిన మేలును గుర్తు చేసుకున్నారు. గ్రామంలో చిన్న పాటి సమస్యలు ఆయన దృష్టికి తెచ్చిన మహిళల ముందే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వచ్చే ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యేగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేయడంతో చేసిన మేలు మరవబోమని తప్పక గెలి పిస్తామని మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బ్రహ్మానంద రెడ్డి జెడ్పీటీసీ ఢిల్లీ రాణి మండల ఇన్చార్జ్ గణపతి నాయుడు మండల పార్టీ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి సర్పంచ్ మురగయ్య రాష్ట్ర గౌడ సంఘ అ.ధ్యక్షురాలు మాదాసు హేమలత అధ్యక్షులు భాస్కర్ రెడ్డి చిట్టి బాబు నా యుడు పంచాయతీ కన్వీనర్ దొరస్వామి, స్థానిక నాయకులు రోశయ్య, ఎం సుబ్రహ్మణ్యం, ఎస్ మధుసూదన్ రెడ్డి, కోదండ రెడ్డి, సింగల్ విండో డైరెక్టర్ ఆరు వెంకట ముని, గ్రామస్తులు పాల్గొన్నారు.

### అర్హతే ప్రామాణికంగా.. సంక్షేమం

జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు కులం, మతం, ప్రాంతం, వర్గం, పార్టీ అన్న తేడా లేకుండా అర్హతే ప్రామాణికంగా తీసుకున్నందుకు అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి వివరించారు. గ్రామంలో స్థానిక మహిళలు సైతం జగనన్న ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో తమకు గౌరవం పెరిగిందని సంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్నే మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## స్పార్క్ చిత్రం ఒక కొత్త బెంచ్ మార్క్

- హీరో విక్రాంత్





తిరుపతి, అక్టోబర్ 4, మనం న్యూస్ : పాన్ ఇండియా స్థాయిలో మంచి థ్రిల్లర్, యాక్షన్, ప్రేమ సమ్మేళనంతో రూపొం దించిన స్పార్క్ చిత్రం ఒక కొత్త బెంచ్ మార్క్ నిలిచి ప్రేక్షకులను ఆకట్టుందని స్పార్క్ హీరో విక్రాంత్ తెలిపారు.నవంబర్ 17 వ తేదీన స్పార్క్ చిత్రం విడుదల నేపథ్యంలో చిత్రం యూనిట్ తిరుమల శ్రీవారి దర్శనార్థం తిరుపతికి విచ్చేసిన సందర్భంగా బుధవారం ఓ. ప్రైవేటు హోటల్‌లో మీడియా సమావేశం నిర్వ హించారు.ఈ సంద ర్భంగా స్పార్క్ చిత్రంలోని రెండవ పాట ను, ట్రైలర్ ను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఈ చిత్రం క థ, స్క్రీన్స్ దర్శకుడు, హీరో విక్రాంత్ మాట్లాడుతూ సినిమా అంటే తనకెంతో ఇష్టం కావడంతో ప్రత్యేక శిక్షణ పొందానన్నారు. తెలుగులో రాజమౌళి, సుకుమార్. తమిళ దర్శకుడు శంకర్ అంటే తనకెంతో ఇష్టమని, ఈ నేపథ్యంలో యూఎస్‌లో జరిగి న కొన్ని యధార్థం సంఘటనలను బేస్ చేసుకొని కొంత కల్పితతో ఈ చిత్రాన్ని రూపొందించడం జరిగిందన్నారు. చక్కటిలో కేషన్స్, అ ద్భుత స్క్రీన్తో రూపొందించిన ఈ చిత్రం దర్శకులు రాజమౌళి, సుకుమార్, శంకర్ షేడ్స్ ఉంటాయని తెలిపారు. కుటుంబ సమేతంగా అందరూ చూసి ఆనందించేలా థ్రిల్లింగ్, ప్రేమ, యాక్షన్తో పాటు హాస్యంతో ఉంటుందన్నారు. న వంబర్ 17న తెలుగు, తమిళం, మల యాళం కన్నడ వంటి హాజల్లో వి డుదలవుతున్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఈ చిత్రం హీరోయిన్ మెహరిన్ మా ట్లాడుతూ ఎంతో కష్టపడి ఒక అద్భుతమైన రీతిలో రూపొందిం చిన చిత్రం స్పార్క్ అని,ఈ చిత్రం అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకుం టుందన్నారు. స్పార్క్ చిత్రాన్ని ప్రజలందరూ ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఇంట్లో నుంచి గెంటేశాడని మహిళ ఆవేదన

- న్యాయం కోసం వేడుకోలు



మదనపల్లి క్రైమ్, అక్టోబర్ 4, మనం న్యూస్ : కుటుంబ గొడవల్లో భాగంగా భర్త ఇంట్లో నుంచి బయటకు గెంటేశాడని భార్య ఆవేదన వ్యక్తం చేసింది. ఈ క్రమంలో బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్ ను ఆశ్రయించి తన బాధను వ్యక్తం చేసింది. మదనపల్లె మండలం వేంపల్లె పంచాయతీ బండకాడపల్లెకు చెందిన భాస్కర్ భార్య సుజాత కూలి పనులు చేస్తుండేది. ఈ నేపథ్యంలో భాస్కర్ కొంతకాలం కిందట అదే ఊరికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. దీంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై ఇటీవల గొడవ జరగడంతో భాస్కర్ తన భార్యను కొట్టి ఇంట్లో నుంచి బయటకు గెంటేశాడు. దాంతో బాధితురాలు తన పుట్టిల్లు నిమ్మనపల్లె మండలం యర్రాతివారిపల్లెకు చేరుకుంది. అనంతరం తాలూకా పోలీస్ స్టేషన్‌లో భర్తపై కేసు పెట్టింది. అయితే భాస్కర్ తన భార్యను ఇంట్లోకి రానీయకుండా వేధిస్తుండడంతో బాధితురాలు ప్రెస్ క్లబ్ ను ఆశ్రయించి తన ఆవేదనను వ్యక్తం చేసింది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని తన కాపురం నిలబెట్టాలంటూ ఆమె వేడుకుంటోంది. కాగా బీజేపీ నాయకురాలు రేవతి బాధితురాలికి అండగా నిలిచారు. సుజాతకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని మీడియా మద్దతు ఇవ్వాలని కోరారు.

# బిఎల్ఓలు ఎన్నికల విధులను సమర్ధవంతంగా నిర్వహించండి

- ప్రతిదానికి సరైన డాక్యుమెంటేషన్ ఉండాలి
- ఫార్మ్ 6, 7, 8 డిస్పోజల్ పై ప్రత్యేక దష్టి సారించాలి
- ఎటువంటి తప్పులు లేని ముసాయిదా ఓటర్ల జాబితాను సిద్ధం చేద్దాం
- జిల్లా కలెక్టర్ డా.జి.సృజన






కర్నూలు, అక్టోబరు, 04, (మనం న్యూస్) : బిఎల్ఓలు ఎన్నికల విధులను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు, ప్రతి దరఖాస్తుకు సరైన డాక్యుమెంటేషన్ ఉండాలని, ఫార్మ్ 6, 7, 8 డిస్పోజల్పై ప్రత్యేక దష్టి సారించడంతో పాటు ఎటువంటి తప్పులు లేని ముసాయిదా ఓటర్ల జాబితాను సిద్ధం చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన ఈఆర్ఓలు, బిఎల్ఓలను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హల్ నుండి స్పెషల్ సమ్మరీ రివిజన్ - 2024పై ఈఆర్ఓలు, బిఎల్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ డా.జి.సృజన, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి దానికి సరైన డాక్యుమెంటేషన్ ఉండాలన్నారు. సుమొటో అడిషన్స్/డిలిషన్స్ చేయకూడదన్నారు. ఎలక్ట్రోల్ రోల్ నందు అప్డేట్ చేయవలసినవి సిద్ధంగా ఉంచుకోవాలని, సుమారు 25వ తేదీన సంబంధిత సైట్ ఓపెన్ అయ్యే అవకాశం ఉందని ఓపెన్ అయిన రెండు రోజుల లోపు పూర్తి చేయాలన్నారు. అనామొలీస్, జంక్ క్యారెక్టర్స్, వాటిని ప్రత్యేకంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఈపి రేషియో, జెండర్ రేషియో, అనామొలీస్, ఫార్మ్ డిస్పోజల్ డ్రాఫ్ట్ పబ్లికేషన్ లోపే మరొకసారి పరిశీలించాలన్నారు. ఇంటింటి సర్వేలో ఎవరైనా మిస్ అయితే తిరిగి వారితో దరఖాస్తు చేయించాలని, అలా అని బల్క్ దరఖాస్తులు తీసుకునే అవకాశం లేదన్నారు. డూప్లికేట్, ఇతర ప్రాంతాలకు షిఫ్ట్ అయిన ఓటర్స్, డెత్ ఓటర్స్పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు అందరూ ఒకే పోలింగ్ స్టేషన్ నందు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు కుటుంబ సభ్యుల క్రమ సంఖ్యను పరిశీలిస్తూ వారు ఒకే పోలింగ్ స్టేషన్లో ఉన్నారా లేదా అని తనిఖీ చేయాలన్నారు. ఫార్మ్-7 దరఖాస్తులను పునః పరిశీలించాలన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం వారు కుటుంబ సభ్యులను ఒకే పోలింగ్ స్టేషన్ నందు ఉంచేందుకు, పోలింగ్ స్టేషన్ల పేర్లు మార్పిడికి, కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు ఆదేశాలు ఇచ్చారని, సదరు ఆదేశాలు మేరకు ఈ ప్రక్రియను 6వ తేదిలోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు కలెక్టర్ ఆదేశించారు. జిల్లాకు రావాల్సిన బ్యాలెట్, కంట్రోల్ యూనిట్ల, వివిప్యాట్లు రావడం జరిగిందని, వాటిని ప్రస్తుతం స్కానింగ్ నిర్వహిస్తున్నారని వాటికి ఈనెల 16వ తేదీ నుంచి నవంబర్ 10వ తేదీ వరకు ఎఫ్ఎల్సి చెక్ నిర్వహించడం జరుగుతుందని అందుకుగాను ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు వారికి కేటాయించే విధుల ప్రకారం తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. బ్యాలెట్, కంట్రోల్ యూనిట్ల, వివిప్యాట్లకు నిర్వహించి ఎఫ్ఎల్సి చెక్కు జిల్లా పంచాయతీ అధికారి ఇంఛార్జిగా ఉంటారన్నారు.వీడియో కాన్ఫరెన్స్లో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డిఆర్ఓ కె.మధుసూదన్ రావు, ఈఆర్ఓ రమ, డిపిఓ నాగరాజు నాయుడు, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వరూప మహా పాదయాత్రను విజయవంతం చేయండి



మహానంది, అక్టోబర్ 04, (మనం న్యూస్): ఎస్సీ వర్గీకరణ కోసం మందా కష్ణ మాదిగ ఆధ్వర్యంలో అక్టోబర్ ఏడో తారీఖున అల్లంపూర్లో జరిగే విశ్వరూప మహా పాదయాత్రను విజయవంతం చేయాలని ఎంఎస్పి జిల్లా కోకన్వీనర్ సుబ్బన్న మాదిగ, ఎంఎస్పి జిల్లా నాయకులు నరసింహులు మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగల చిరకాల ఆకాంక్ష చిరకాల స్వప్నము ఎస్సీ వర్గీకరణ కోసం పని చేస్తామని, కేంద్రప్రభుత్వం వెంటనే ఇచ్చిన మాటను నిలబెట్టుకొని మాదిగల చిరకాల ఆకాంక్షను నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నామని,అలాగే ఎస్సీ వర్గీకరణ కోసం ఎంతటి త్యాగాలకైనా సిద్ధపడి పనిచేస్తామని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మే మంత్రివర్యులు అమిత్ షా, ఎస్సీ వర్గీకరణ చేసి, మాదిగ, మాదిగ ఉపకులాల, హదయాలను గెలుచుకోవాలని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి మండలాల నాయకులు చెవుల వెంకటసుబ్బయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు. సర్వయ్య మాదిగ. ఎమ్మార్పీఎస్ మండల నాయకులు గడ్డం నాగేశ్వరావు మాదిగ, మాదిగ యువసేన మండల నాయకులు ఈశ్వరయ్య మాదిగ, కానిగాల వెంకటసుబ్బయ్య మాదిగ, మురళీ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## కొట్టాలకు పట్టాలు ఇవ్వకపోతే ఆందోళన ఉధృతం చేస్తాం: వ్యకాస



కర్నూలు, అక్టోబర్ 04, (మనం న్యూస్) : టీవీ9 కాలనీలో నివాసముంటున్న పేదల కొట్టాలకు పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె వి నారాయణ డిమాండ్ చేశారు.బుధవారం లబ్ది దారులతో కలిసి తహశీల్దార్ శివరాముడుకి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శినారాయణసీఐటీయూ మండల అధ్యక్షులుఉషనయ్య మాట్లాడుతూ పేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తుంటే ప్రజాప్రతినిధుల మాటలు విని రెవిన్యూ అధికారులు,పోలీస్ డిపార్ట్మెంట్ వారు వచ్చి వారికి ఏమి చెప్పకుండా జెసిబిలతోకూల్చడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు. వారందరూ టీవీ9 కాలనీలో దాదాపు 10 సంవత్సరాల నుండి అక్కడనే బాడుగ ఇండ్లలో నివాసం వున్నారు. వారిలో చాలా మందికి ఆ అడ్రస్తో ఆదార్,రేషన్ కార్డులు వున్నాయి అటువంటి నిరుపేదలు ప్రభుత్వ స్థలం వుంటే అక్కడ కొట్టాలు వేసుకొని జీవనం సాగిస్తున్న వారిని చూసి అధికారులు వారికి ఇండ్లు కట్టించాల్సిన అధికారులు దానికి విరుద్ధంగా వ్యవహరించారని వారు తెల్పారు అధికారులు ఎవరి కోసం పని చేస్తున్నారో అర్థం చేసుకోవాలని వారు తెల్పారు.ముఖ్యమంత్రి జగన్ ఇండ్లు లేని వారందరికీ ఇండ్లు కట్టించి ఇస్తామని చెప్తుంటే అధికారులు మాత్రం దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని వారు తెలిపారు కావున పేదలకు కూల్చిన చోటనే సర్వే చేసి పట్టాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని వారు హెచ్చరించారు. తహశీల్దార్ సర్వే చేసి ఇండ్లు లేని వారందరినీ గుర్తించి వారికి పట్టాలిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో రజియా అల్మాస్ కష్ణవేణి ఫాతిమా రాముడు సూరి తదితరులు పాల్గొన్నారు.



# చిరుధాన్యాల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

- సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు
- కర్నూలు లో జిల్లా ఆదోని మండలం చిన్న పెండేకల్ గ్రామం వద్ద రూ. 4.41 కోట్లతో ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన






కర్నూలు, అక్టోబర్ 04, (మనం న్యూస్) : చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు.ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీలో భాగంగా రాష్ట్రంలో 13 సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్లకు ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్గా శంకుస్థాపన చేశారు.. ఇందులో భాగంగా కర్నూలు జిల్లా ఆదోని మండలం చిన్న పెండేకల్ గ్రామం వద్ద రూ. 4.41 కోట్లతో ఏర్పాటు చేయనున్న సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.శంకుస్థాపన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిరుధాన్యాలు పండించే రైతులకు సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో జొన్నలు, కొర్రలు, సజ్జలను ఎక్కువగా పండించడం జరుగుతోందని, అందువల్ల ఆదోని ప్రాంతంలో చిరు ధాన్యాలు సాగు చేసే రైతులకు ప్రోత్సాహకంగా ఈ యూనిట్ ను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు..ఈ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా కొర్ర, జొన్న, సజ్జలను పౌడర్ చేసి మిల్లెట్ ఫ్లోర్, బిస్కెట్స్, మిల్లెట్ ఫ్లేక్స్, వర్మిసెల్లి, నూడిల్స్ తదితర విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి మార్కెటింగ్ చేయడం జరుగుతుందన్నారు.. తద్వారా రైతుల ఆదాయాన్ని మరింత పెంచి వారి జీవనోపాధిని మెరుగుపరచడంతో పాటు మిల్లెట్ల వాడకంతో ప్రజల ఆరోగ్యం కూడా బాగుపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు..ఈ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా పరిసర ప్రాంతాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని తెలిపారు.కర్నూలు ఎంపీ డా. సంజీవ్ కుమార్ మాట్లాడుతూ వెనుకబడిన ఆదోని ప్రాంతంలో ఇలాంటి ప్రాసెసింగ్ యూనిట్ల అవసరాన్ని గుర్తించి ప్రభుత్వం ఆదిశగా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు..ఈ యూనిట్ ఏర్పాటు ద్వారా రైతులకు మేలు జరగడంతో ప్రజలకు ఆరోగ్య పరంగా కూడా ఎంతగానో ఉపయోగం ఉంటుందని ఎంపీ తెలిపారు.కోడుమూరు ఎమ్మెల్యే డా. జె.సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి ఎంతగానో ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి,ఏపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమా దేవి, డిఆర్డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగశివలీల, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రామచంద్రయ్య జిల్లా ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# జగన్ నిరంకుశ పాలన నశించాలనే ప్రజలమధ్యకు..

- టిడిపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి సోమిశెట్టి వెల్లడి



కర్నూలు, అక్టోబర్ 04, (మనం న్యూస్) : తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్కు ఎనలేని సేవలందించిన శ్రీ నారా చంద్రబాబు నాయుడుని రాష్ట్ర ముఖ్యమంత్రి. జగన్మోహన్రెడ్డి సి.ఐ.డి ని అడ్డుపెట్టుకొని ఎలాంటి ముందస్తు నోటీసులు అందజేయకుండా అర్ధరాత్రివేళ అక్రమ కేసుబనాయించి, ఆరెస్టు చేయించి, జైలుకు పంపించి పెద్ద తప్పు చేశారనీ, జగన్ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, నిరంకుశ విధానాలను ఎత్తిచూపి, ప్రజలను చైతన్యపర్చుచున్న చంద్రబాబు:ని అరెస్టు చేసినంతమాత్రాన వారు తప్పు చేసినట్లు కాదనీ, అందువల్లనే జగన్ నిరంకుశ పాలననుండి ప్రజలను కాపాడేందకు ఏనాడు కూడా ప్రజల మధ్యకు రానటువంటి శ్రీమతి నారా భువనేశ్వరి, శ్రీమతి నారా బ్రహ్మణి ప్రజల మద్యకు వచ్చారనీ తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఈ రోజు ఆయన రాష్ట్ర పార్టీ కార్యదర్శి వై. నాగేశ్వరరావుయాదవ్తో కలిసి కర్నూలు పార్టీ నియోజకవర్గం ఇన్చార్జి టి.జి. భరత్ నాయకత్వంలో నిర్వహించబడుతున్న నిరసన దీక్షాశిభిరాన్ని సందర్శించి సంఘీభావం తెలియజేశారు.చంద్రబాబునాయుడుని అరెస్టు చేసి 25 రోజులు కావస్తున్నా అరెస్టు చేసిన సి.ఐ.డి. వారు రెండు రోజులు జ్యాడిషియల్ కస్టడీ నుండి తమ అధీనంలోకి తీసుకొని విచారణ చేశారనీ, ఎలాంటి ఆధారాలను బయటపెట్టలేకపోయారనీ, కోర్టులో చంద్రబాబునాయుడు తరుపున వాదిస్తున్న న్యాయవాదుల వాదనలను, సి.ఐ.డి. తరుపున వాదిస్తున్న న్యాయవాదుల వాదనలను విన్నటువంటి న్యాయస్థానం ఆధారాలను ఇవ్వవలసినదిగా కోరినప్పటికిని కనీసం కోర్టు ముందు కూడా ఎలాంటి రుజువులు, ఆదారాలు చూపలేక కేవలం చంద్రబాబునాయుడుని ఎన్ని ఎక్కువరోజులు జైలులో ఉంచాలా అనే దురుద్దేశంతో న్యాయస్థానాలలో దాటివేత విధానాన్ని అవలంబిస్తున్నారనీ, అయినా జగన్ కుట్రపూరిత రాజకీయాల నుండి న్యాయస్థానం ద్వారా చంద్రబాబునాయుడు గారు న్యాయాన్ని పొంది బయటకు వస్తారనీ అన్నారు. చంద్రబాబు ని అక్రమంగా అరెస్టు చేసినంత మాత్రాన తానేదో గొప్పపనిచేశానని జగన్ విర్రవీగుతున్నారనీ, చంద్రబాబు జైలులో ఉండగా రాష్ట్ర ప్రజలకు మనోధైర్యాన్నిచ్చేందుకు, జగన్ రాక్షస పాలనను ప్రశ్నించేందుకు శ్రీమతి నారా భువనేశ్వరి, నారా బ్రహ్మణి ప్రజాక్షేత్రంలోకి వచ్చారనీ, ఏరోజు కూడా గడపదాటి భయటకు రాని వారు ఈ రోజు కేవలం ప్రజల కోసం భయటకు వచ్చారంటే వారి ఉసురు ఖచ్చితంగా జగన్కు తగులుతుందనీ. తెలిపారు.చంద్రబాబు అరెస్టుతో పార్టీ క్యాడర్ జగన్పై మరింత కసి పెంచుకొని రాష్ట్రంలో ఎక్కడ చూసినా జగన్రెడ్డి చర్యలను ఖండిస్తూ నిరసనలు వెల్లువెత్తుతున్నాయనీ, ఒక్క ఆంధ్రప్రదేశ్లోనే కాక, భారతదేశంలోని అన్ని రాష్ట్రలలో చంద్రబాబు అక్రమఅరెస్టును ఖండిస్తూ వారికి అండగా నిలిచాయి. అంతేకాక చంద్రబాబు అరెస్టు నిరసిస్తూ ప్రపంచ దేశాలలో నిరసన కార్యక్రమాలు. జరిగాయంటే అది చంద్రబాబు నీతి, నిజాయితీకి నిదర్శనమనీ, జగన్ కక్షపూరిత రాజకీయాలు, జగన్ చేసిన నీచ రాజకీయ చరిత్ర యావత్ ప్రపంచదేశాలకు పాకిపోయిందనీ తెలియజేశారు. త్వరలో చంద్రబాబు నాయుడు న్యాయస్థానం ద్వారా తన నిజాయితీని నిరూపించుకొని భయటకు వస్తారనీ, చంద్రబాబు పట్ల జగన్ అనుసరించిన కక్షపూరిత రాజకీయాలను వై.కా.పా నాయకులే వ్యతిరేకిస్తున్నారనీ, ప్రజలకు దూరమైన జగన్ తన సొంత పార్టీ వారికి కూడా దూరమయ్యే రోజులు అతి చేరువలో ఉన్నాయని హెచ్చరిస్తున్నా. ప్రజలకు కూడా ఒకటే విజ్ఞప్తి ఇప్పటికే రాష్ట్రాన్ని అన్ని విధాల సర్వనాశనం చేసిన జగన్కు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలంటే వారు చేర్పించిన బోగస్ ఓట్లను సాధ్యమైనంతవరకు ఎన్నికల అధికారుల దష్టికి తీసుకొనివెళ్ళి, వాటిని తొలగించేందుకు కషిచేయాలనీ, ఎన్నికల రోజు ప్రతి ఒక్కరు కూడా మీ యొక్క ఓటును సద్వినియోగపర్చుకోవాలనీ, జగన్ లాంటి వారికి బుద్ధి చెప్పాలంటే రానున్న ఎన్నికల్లో ఖచ్చితంగా చంద్రబాబునాయుడుకి అండగా నిలిచి తెలుగుదేశంపార్టీని అధికారంలోకి తీసుకొని రావాలనీ, ఆంధ్రరాష్ట్ర భవిష్యత్త, పిల్లల భవిష్యత్ భాగుపడాలంటే చంద్రబాబుని ముఖ్యమంత్రి చేసుకోవాలనీ పిలుపునిస్తున్నా. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గున్నా మార్క్, నాగరాజుయాదవ్, యస్. అబ్బాస్, నంది మధు, కె. పరమేష్, మంచాలకట్ట భాస్కరరెడ్డి, పాల్ రాజ్, బీ. చిన్నమ్మి, వినోద్, ప్రభాకర్, వలీ, అనందబాబు, సి.కిరణ్, రామక్రిష్ణ, రాజ్యలక్ష్మి, మొదలగు వారు పాల్గొన్నారు.

## చర్చి అభివృద్ధికి లక్షల రూపాయలు విరాళం



మంత్రాలయం, అక్టోబర్ 04, (మనం న్యూస్) : మండల పరిధిలోని బూదూరు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు జక్కయ్య గ్రామంలో ఉన్న చర్చి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి లక్ష రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ గ్రామంలోని క్రైస్తవులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘపెద్దలు, నాగరాజు, యేసేపు, జైపాల్, బోయజు, విజయ్, యేసు, బ్రిటీష్, రాజు, ఇమ్మానియేల్ అబ్రహం. సామేలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటా ఆరోగ్య రక్షణకే 'జగనన్న ఆరోగ్య సురక్ష'

- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి



ఓర్వకల్లు, అక్టోబర్ 04, (మనం న్యూస్): వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చినట్లు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తెలిపారు. ప్రతి ఇంటా ఆరోగ్య రక్షణ కోసమే'జగనన్నఆరోగ్యసురక్ష' కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. బుధవారం మండల పరిధిలోని నన్నూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కాటసాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన హెల్త్ క్యాంపు స్టాళ్లను ఆయన పరిశీలించి, ఏయే కౌంటర్లలో ఎలాంటి వైద్య సేవలు అందుతున్నాయనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజారోగ్యమే ఈ కార్యక్రమ ముఖ్య లక్ష్యమని తెలిపారు. సీఎం జగన్ అన్ని వర్గాల ప్రజలను దష్టిలో పెట్టుకుని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి కొత్తగా రూపకల్పన చేశారని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా మారుమూల ప్రాంతాల్లోని ప్రతి గడపకు వైద్యులు వెళ్లి వైద్యం అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు పోతోందన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివ ప్రసాద్ రెడ్డి, ఎంపీడీవో శివనాగ ప్రసాద్, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, వైయస్సార్సీపి మండలాధ్యక్షుడు చెన్నారెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జడ్పిటిసి రంగనాథ్ గౌడ్, మండల జెసిఎస్ కన్వీనర్ లోటర్ భాష, గ్రామ సర్పంచ్ బ్రహ్మయ్య, వివిధ గ్రామాల వైఎస్ఆర్సిపి నాయకులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైసిపితోనే అభివృద్ధి సాధ్యం ఎంఎల్ఏ : సాయి ప్రసాద్ రెడ్డి



ఆదోని, అక్టోబర్ 04, (మనం న్యూస్) : రాష్ట్రం అన్ని అన్ని విదాల అభివద్ధి చెందాలంటే వైసిపి తోనే సాధ్యమవుతుందని ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి అన్నారు ప్రాంతాలలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం గడపగడపకు అనే కార్యక్రమం ప్రవేశపెట్టిందని తెలియజేశారు మండల పరిధిలోని దొడ్డనకేరి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమం నిర్వహించారు గ్రామంలోని ఇంటింటికి వెళ్తూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు అర్హులైన వారికి అందుతున్నాయా లేదా అన్నది అడిగి తెలుసుకున్నారు మీ గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దష్టికి తీసుకురావాలని గ్రామస్తులకు తెలియజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ దేశానికి పట్టుకొమ్మలైన గ్రామాలు అభివద్ధి చెందాలన్నదే ప్రభుత్వ ద్యేయమని అన్నారు గ్రామాలలో నెలకొన్న సమస్యలు గ్రామస్థాయిలోనే పరిష్కారం అయ్యే విదంగా ఉండేందుకు ఏ రాష్ట్రంలో లేని విధంగా సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చిన ఘనత జగన్మోహన్ రెడ్డి దేనన్నారు సచివాలయ వ్యవస్థతోపాటు 50 ఇండ్లకు ఒక వాలంటీర్ని నియమించారని తెలియజేశారు గ్రామస్థాయిలో అన్ని శాఖలకు చెందిన అధికారులను కూడా సచివాలయాలకు నియమించారని పేర్కొన్నారు అక్కడ ఉన్న సమస్యలు అక్కడే పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకునే బాధ్యత సచివాల సిబ్బందిపై ఉందన్నారు సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది సక్రమంగా పనిచేయకపోతే అలాంటి వారిపై తమకు గానీ అధికారులకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్న ఘనత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానిదే అన్నారు రైతు భరోసా పథకం ద్వారా రాష్ట్రంలో ఉన్న రైతులందరికీ సంవత్సరానికి రూ 13 వేలు రైతుల ఖాతాలలో జమ చేస్తున్న ఘనత జగన్ మోహన్ రెడ్డి అన్నారు నియోజకవర్గంలో నీ ప్రజలకు వైసీపీ నాయకులకు కార్యకర్తలకు ఎలాంటి సమస్యలు వచ్చినా తమ దష్టికి తీసుకువస్తే అలాంటి సమస్యలను పరిష్కరించేందుకు తాము అందరికీ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు డాక్టర్ మధుసూదన్ ఎంపీడీవో గీతా వాణి మండల స్థాయి అధికారులు సచివాలయం సిబ్బంది వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం



ఓర్వకల్లు, అక్టోబర్ 04, (మనం న్యూస్): ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం వెల్లివిరుస్తోందని పాణ్యం శాసనసభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేను గ్రామస్తులు హారతులు, మేళతాళాలతో ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్దిని వివరిస్తూ బుక్ లెట్ అందజేశారు. సంక్షేమ పథకాల విషయంతో పాటు గ్రామంలో ఇతర సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు సచివాలయ ఉద్యోగులను సంప్రదించాలన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా సీఎం జగన్ రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని, తిరిగి రానున్న ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మళ్ళీ అధికారంలోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జడ్పిటిసి రంగనాథ్ గౌడ్, మండల జేసీఎస్ కన్వీనర్ లోటర్ భాష, వివిధ శాఖల అధికారులు, స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## తిరస్కరిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం



పత్తికొండ అక్టోబర్ 04, (మనం న్యూస్) :ఈనెల 5వ తారీఖు నుండి ప్రతి పిటిషన్‌పై 20 రూ పాయలు స్టాంపును అతికించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ నిర్ణయాన్ని తిర స్కరిస్తూ పత్తికొండ న్యాయవాదుల సంఘం బుధవారం ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగినది. ఇదివరకు కక్షిదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పి టిషన్లు దాఖలు చే స్తున్న న్యాయవాదులు రాష్ట్ర బార్ అసోసి యేషన్ వారు తీసుకున్న 20 రూపాయల స్టాంపును అతికిస్తే కక్షిదారులకు ఇ బ్బంది కలుగుతుందని పత్తికొండ బార్ సోసియేషన్ అధ్యక్షుడు ఎన్ కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో న్యాయవాదులు అందరూ కలిసి ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగినది.అలాగే న్యాయవాదు లపై జరుగు తున్న దాడులు గురించి రాష్ట్ర బార్ అసోసి యేషన్ ఎ టువంటి చర్యలు తీసుకోవడం లేదని వారు వాపోయారు. న్యాయ వాదుల సంక్షేమ నిధి గురించి కూడా ఇంతవరకు వారు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఇది ఎంత మాత్రం సబబు అని వారు ఆవే దన వ్యక్తం చేశారు.కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్య దర్శి రంగస్వా మి,సీనియర్, జూనియర్ న్యాయవాదులు ఎల్లారెడ్డి, గోపాల్ రెడ్డి, సత్యనారాయణ, లక్ష్మన్న, ఎంసీఎస్ నాయుడు, సు రేం ద్ర, నర సింహయ్య, మహేష్, బాలభాష, మధుబాబు పాల్గొన్నారు.

## రైతులు గోడు చూడండి, పట్టించుకోండి

- కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మహేంద్ర నాయుడు



దేవనకొండ, అక్టోబర్ 04, (మనం న్యూస్) :దేవనకొండ మండ లంలో బేతపల్లి,కోటకొండ,బంటుపల్లి తదితర గ్రామాల్లో వర్షలు లేక పండించిన పంటలు ఎండిపోవడం వల్లా పంటలు దున్నేస్తున్న రైతు ల పంటలను పరిశీలించి వారి గోడును విన్నాను కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మహేంద్ర నాయుడు.నియోజకవర్గంలో వర్షలు పడకపోవా టం వల్ల వేసిన పంటలు మధ్యలోనే ఎండిపోతూన్నాయి.పేట్టుబడి కి పేట్టిన డబ్బులు కూడ వచ్చేటట్టులేవు అని భాద పడ్డారు,అప్పులు పా లు అవుతూన్నమని తెలియజేయటం జరిగింది.పాలకులు ఇచ్చే నష్ట పరిహారం పిచికారి మందులకు సరిపోవటం లేదు అన్నారు. కోంత మంది రైతులు అయితే పంట పేట్టుబడులకు చేసిన అప్పులు భాద లుతో ఆత్మహత్యలకు పాల్పడే విధంగా ప్రభుత్వం వ్యవహరించటం భాదకారం అని ఆయన అన్నారు.అందుకే వేనకబడి ఈ ప్రాంతం నుండి వలసలు అధికం అవుతున్నాయని ఆయన తేలియజేశారు. కా వున వేంటనే కరువు ప్రాంతంగా ప్రకటించి వలసలు,రైతులు ఆత్మహ త్యలు నివారించండి.అభివద్ధి అంటే పేద్ద పేద్ద సచివాలయాల భవన లు కాదు అన్నం పేట్టే రైతు నైతిక అభివృద్ధే నిజమైన అభివృద్ధి అ న్నారు. ప్రభుత్వం రైతులు సమస్యలు వినటం కాదు, డచూడండి, పట్టించుకోండి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలూరు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు వేంకట్, రాముడు, ముని, హనుమంతు, జకీర్, బస్కర్, విష్ణు, వంశి తదితరులు పాల్గోన్నారు.

## వై ఏపీ నీడ్స్ కార్యక్రమంలోఎమ్మెల్యే




పత్తికొండ, అక్టోబర్ 04, (మనం న్యూస్) : వైఎపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా వైసిపి పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు గ్రామ వార్డు పట్టణాలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వి వరించాలని శాసనసభ్యురాలు కంగాటి శ్రీదేవమ్మ సూచించారు. బుధ వారం స్థానిక వైఎస్సార్సీపీ కార్యాలయంలో వైఏపీ నీడ్స్ జగన్ కార్య క్రమంపై వైసిపి కార్యకర్తలకు నాయకులకు సమావేశం జరిగిం ది. ఈ సమావేశానికి 5 మండలాల వైసిపి ఎంపీపీలు, జడ్పీటీసీలు, మండల కన్వీనర్లు, సచివాలయ మండల కన్వీనర్లు, ప్రజా ప్రతినిధు లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎ మ్మెల్యే మాట్లాడుతూ పార్టీ ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసు కుందన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి గడపకు వెళ్లి రాష్ట్రం అన్నిరం గాలలో అభివృద్ధి చెందాలంటే మళ్ళీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సీ ఎం కావాల్సిన అవశ్యకత గురించి వివరించాలని తెలిపారు.ఈ నాలు గున్నర ఏళ్లలో చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి తెలపాలన్నారు.ఈ కార్యక్రమంలో పత్తికొండ నియోజకవర్గం వైఎస్ఆర్ పార్టీ ముఖ్య నాయకులు, సచివాలయం కన్వీనర్లు పాల్గొన్నారు.

## నేదురుమల్లి పద్మనాభరెడ్డి మరణం వైసీపీకి తీరని లోటు

- ఎంపీ గురుమూర్తి

తిరుపతి, అక్టోబర్ 04, (మనం న్యూస్): వైఎస్సార్ కాంగ్రెస్ పా ర్టీ సీనియర్ నాయకుడు, దివంగత ముఖ్యమంత్రి నేదురుమల్లి జనా ర్ధన రెడ్డి సోదరుడు నేదురుమల్లి పద్మనాభరెడ్డి పరమపదించారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని ఆయన ఆత్మకు శాంతి చేకూ రాలని, ఆయన కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం ప్రసాదిం చాలని కోరుకుంటున్నట్లు తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి పేర్కొ న్నారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భలోపేతానికి పద్మనాభ రెడ్డి కృషిని ఎంపీ స్మరించుకొన్నారు. స్టాండింగ్ కమిటీ మీటింగ్లో పాల్గొనేందుకు ఢిల్లీలో ఉన్న ఎంపీ గురుమూర్తి ఫోన్‌లో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.

# 4.41 కోట్ల రూపాయలతో సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ మంజూరు

- జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సమూన్



నంద్యాల, అక్టోబర్ 04, (మనం న్యూస్): ప్రజలందరూ చిరుధా న్యాల ఆహార పదార్థాలను వినియోగించి ఆరోగ్యాన్ని పరిరక్షించు కోవా లని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సమూన్ విజ్ఞప్తి చేశారు. బుధవా రం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లా లలో మొత్తం రూ. 2958.69 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఏడు పరిశ్ర మల యూనిట్లు, 6 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు మరియు 13 సెకండరీ మిల్లెట్స్ ప్రాసెసింగ్ యూనిట్స్‌కు వర్చువల్‌గా రాష్ట్ర ముఖ్యమంత్రి వై యస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభోత్సవం మరియు భూమి పూజ చేసే కా ర్యక్రమాలను కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్‌తో పాటు ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి, మైనారిటీ సంక్షేమ అభివద్ధి సల హాదారు హాబీబుల్లా, మార్క్ ఫెడ్ చైర్మన్ పి.పి.నాగిరెడ్డి, మార్కెట్ యా ర్డ్ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, ఏపి ఫుడ్ ప్రాసెసింగ్ చైర్మన్ రామలింగారెడ్డి, ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళ, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి మరియు ఫుడ్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగరాజు ఇతర అధికారులు తదితరులు పాల్గొని వీక్షించారు.అనంతరం జిల్లా కలె క్టర్ డా. మనజీర్ జిలాని సమూన్ మాట్లాడుతూ జిల్లాలో నంద్యాల మండలం రాయమాల్పురం గ్రామంలో 4.41 కోట్ల రూపాయల ఖర్చు తో ఏర్పాటు చేయనున్న సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిటుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వర్చువల్‌గా శంకు స్థాపన చేశారన్నారు. మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ పూర్తయితే చిరుధాన్యాలు సాగు చేసే రైతులందరికీ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రజలం దరూ చిరుధాన్యాలను ఆహార పదార్థాలుగా వినియోగించి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడంతోపాటు చిరుధాన్యాల ఉత్పత్తుల రైతులను ప్రోత్స హించాలన్నారు.పోషక విలువలు కలిగిన చిరుధాన్యాల పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వ అనేక ప్రోత్సాహకాలు ఇస్తుందన్నారు. ఉమ్మడి జిల్లా పరి షత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన స మాజ నిర్మాణానికి చిరుధాన్యాలు ఎంతగానో తోడ్పడుతాయన్నారు. ఆ ర్బికెల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులతో పాటు రైతు లకు అవసరమైన సలహాలు సూచనలు అందిస్తున్నారన్నారు.నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ నంద్యాల జి ల్లా చిరుధాన్యాల ఉత్పత్తికి ప్రసిద్ధిగాంచిందన్నారు. పూర్వపు రోజుల్లో ప్ర జలు చిరుధాన్యాలను అధికంగా వినియోగించి మన పూర్వీకులు చాలా సంవత్సరాలపాటు ఆరోగ్యంగా ఉన్నారన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2023 సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందన్నారు. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజల ఆ హారపు అలవాట్లలో మార్పులు చెంది చిరుధాన్యాలు వినియోగించడం ఒక బాగమైందన్నారు. చిరుధాన్యాల సాగు పెంపుకు సంబంధించి నం ద్యాల నియోజకవర్గంలో సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ మం జూరు చేసిన ముఖ్యమంత్రికి రైతులందరి తరపున ప్రత్యేక ధన్యవాదా లు తెలియచేశారు.అనంతరం నంద్యాల మండలం రాయమాల్పురం గ్రామంలో 4.41 కోట్ల రూపాయల ఖర్చుతో ఏర్పాటు చేయనున్న సె కండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిటు శిలాఫలకాన్ని జిల్లా కలెక్టర్, జిల్లా పరిషత్ చైర్మన్ ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మ న్ తదితరులు ఆవిష్కరించారు.

## పోలింగ్ పరికరాల ఫస్ట్ లెవెల్ చెక్‌కి రాజకీయ పార్టీలు పాల్గొనాలి

- జిల్లా ఎన్నికల అధికారి. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన



కర్నూలు, అక్టోబర్ 04, (మనం న్యూస్) : బుధవారం సాయంకా లం జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన రాజకీయ పార్టీల సమా వేశాన్ని నిర్వహించారు. జిల్లాకు వచ్చిన పోలింగ్ పరికరాల పరిశీలన మ రియు పనితీరు అంచనా వేసుకోవడానికి గాను రాజకీయ పార్టీలు ఈనెల అక్టోబర్ 16వ తారీకు నుండి నవంబర్ 10 వ తారీకు వరకు జరుగు ఫస్ట్ లెవెల్ చెక్ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. దీనికి సంబం దించిన షెడ్యూలు అన్ని రాజకీయ పార్టీలకు అందజేస్తామని తెలిపారు. ఈ చెకింగ్‌లో అన్ని పరికరాలు జత చేసి పరీక్షిస్తారని కావున ఈ కార్యక్ర మానికి రాజకీయ పార్టీల కు సంబంధించిన ఒక ప్రతినిధి పూర్తి సమ యం కేటాయించి పర్యవేక్షించుకోవాలని కోరారు.ఈ సందర్భంగా కర్నూ లు జిల్లాకు 7020 బ్యాలెట్ యూనిట్లు, 5460 కంట్రోల్ యూనిట్లు మరి యు 6650 వి.వి.పాట్ యూనిట్లు వచ్చాయని వాటిని ఎన్నికల గోడౌన్ లో భద్రపరచడం జరిగిందని తెలిపారు.పోలింగ్ స్టేషన్ కు సంబంధించిన ఫిర్యాదులు కానీ సూచనలు కానీ ఈనెల అక్టోబర్ 07-10-23 తారీఖు లోపల ఇవ్వాలని, వాటిని క్రోడీకరించి మేము ఎలక్షన్ కమిషన్‌కు 09-10 -23 వ తారీకు పంపవలసి ఉంటుందని తెలియజేశారు. కుటుంబంలోని సభ్యులు అందరూ ఒకే పోలింగ్ స్టేషన్లో ఉండే విధంగా అన్ని చర్యలు తీ సుకుంటున్నామని నమూనా ఓటర్ లిస్ట్ ఈనెల 27వ తారీకు పూర్తి అ వుతుందని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.ఈ సమావేశంలో పార్టీల ప్రతినిధులు వారు గమనించిన పోలింగ్ స్టేషన్‌ల సమస్యలను జిల్లా ఎన్నికల అధికారి దష్టికి తీసుకుని వచ్చారు. జిల్లా ఎన్నికల అధికారి స్పం దిస్తూ ఈ విషయంపై ఎలక్షన్ సెల్ సూపరింటెండ్ మురళిని సంబంధిత ఈ. ఆర్ .ఓ ద్వారా సమాచారాన్ని సేకరించి సమర్పించాలని ఆదేశించినా రు. తదనంతరం రాజకీయ పార్టీ ప్రతినిధులు జిల్లా ఎన్నికల అధికారి కో రిక మేరకు ఎలక్షన్ ఎలక్షన్ గోడౌన్ సందర్శించి అక్కడ ఉన్న ఇంజనీర్ల ద్వారా ఎలక్షన్ సామాగ్రి పనిచేస్తున్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కూడా పాల్గొన్నారు. ఈ సమావేశానికి డి ఆర్ ఓ మధుసూధన రావు, రాజకీయ పార్టీ ప్రతినిధులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున స్టేట్ లీగల్ జనరల్ సెక్రెటరీ పుల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ తర పున జిల్లా కార్యదర్శి సత్యనారాయణ గుప్తా మరియు కర్నూల్ సిటీ అధ్య క్షులు జాన్ విల్సన్, బహుజన సమాజ్ పార్టీ తరపున జిల్లా ఇన్చార్జి అరు ణ్ కుమార్, తెలుగుదేశం పార్టీ తరపున చంద్రహాస్ పాల్గొన్నారు.

## కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యేకు వినతి

- వినతి పత్రం సమర్పించిన సిపిఐ నాయకులు



పత్తికొండ అక్టోబర్ 04, (మనం న్యూస్) : కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని పంట నష్టపో యిన రైతులకు ఎకరాకు 40000 నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చే స్తూ బుధవారం సిపిఐ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆ ధ్వర్యంలో పత్తికొం డ శాసనసభ్యురాలు కంగాటి శ్రీదేవమ్మకి వినతి పత్రం ఇస్తున్న సిపిఐ రైతు సంఘం బందం అనంతరం సిపిఐ మండల కార్యదర్శి డి. రాజా సా హెబ్ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాలూకా కార్యదర్శికె పెద్దఈరన్నలు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సీజన్లో వర్షాలు కురవని కార ణం గా రైతులు వేసిన ప్రధాన పంటలు పత్తి, వేరుశనగ,కంది, ఆముదము, జొన్న, కొర్ర, తదితర పంటలు లక్షలాది హెక్టార్లలో సాగు చేశారు. వర్షా లు లేని కారణంగా మొలక దశలోనే పంటలు వాడిపోయి ఎండిపోవడం జ రిగింది. పంటలు సాగు చేయడానికి బ్యాంకుల్లో, మరియు ప్రైవేటు వ్యక్తుల దగ్గర అప్పులు చేసి అప్పులు కట్టలేక రైతులు ఆత్మ హత్య చేసుకు న్న పరిస్థితులు నిరంతరము చూస్తూ ఉన్నాం ఇప్పటికే రైతులు వందల కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయారు. విత్తనాలు, ఎరువులు, సేద్యపు ఖర్చుల కోసం రైతుల పెట్టిన పెట్టుబడులు చిల్లిగవ్వ చేతికి రాక పోవడంతో నిరాశ నిస్పృహలతో ఆందోళన చెందుతూ తెచ్చి న అప్పులు కట్టలేక జిల్లాలోఇప్పటికే అనేక మంది రైతులు హాట్ స్ట్రోక్ తో మరియు పురుగుల మందు తాగి ఆత్మహత్యలు చే సుకుంటున్నారు. త క్షణమే రైతులను ఆదు కోవాల్సిన అవసరం ఉంది గ్రామాలలో పను లు లేక సుదూర ప్రాంతాలకు వలసపోయి అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ముగిసిపోయింది. కాబట్టి ప్రభుత్వము జిల్లాను క రువు జిల్లాగా ప్రకటించి, కరువు సహాయక చర్యలు చేపట్టి, రైతులను, ప్రజలను ఆదుకోవడానికి తమరు ప్రభుత్వం మీద ఒత్తిడి చేయడానికి ఎ మ్మెల్యేలు అధికారులు పంట పొలాలు పరిశీలించి కరువు సహాయక చర్య అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపి కరువు డిక్లేర్ చేయాల్సింది గా ప్రభుత్వం డిమాండ్ చేస్తున్నాం జిల్లాలో అన్ని నియోజకవర్గాల శాస నసభ్యులకు వినతి పత్రాలు సమర్పిస్తున్నాం, కావున తమరు చొరవచేసి న్యాయం చేయాలని కోరుతున్నాము కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, కరువు సహాయక చర్యలు చేపట్టాలి. రైతులు అన్ని బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలను రద్దు చేయాలి.పంటవేసి నష్టపో యిన ప్రతి రైతుకు పత్తి,వేరుశనగ, ఆముదము, కంది, జొన్న, పంటలకు ఎకరాకు 40,000 వేల రూపాయలు పంట నష్టపరిహారంఇవ్వాలి. ఉల్లి, మిర్చి, మరియు ఉద్యానవన పంటలకు ఎకరాకు లక్ష రూపాయలు పంట నష్టప రిహారం ఇవ్వాలి.పశువులకు పశుగ్రాసం పంపిణీ చేయాలి.ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస పోకుండా అన్ని గ్రామాలలో పనులు కల్పించాలి. కోరుతూ ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇస్తున్న కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె తిమ్మయ్య ఆంధ్రప్రదేశ్ రైతు సం ఘం తాలూకా అధ్యక్షులు ఎం.కారన్న సిపిఐ తుగ్గలి మండల కార్యదర్శి ఎస్. సుల్తాన్ దళితుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు గురు దాస్ ఎఐటియుసి తాలూకా అధ్యక్ష కార్యదర్శులు నెట్టికంటయ్య రంగన్న సిపిఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు వ్యవసాయ కార్మిక సంఘం తాలూ కా అధ్యక్షులు వెంకట్రాం రెడ్డి ఎఐటియుసి తాలూకా వర్కింగ్ ప్రెసిడెం ట్ గుండు బాషా ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షులు పెద్దయ్య సిపిఐ రైతు సంఘం నాయకులు వెంకట్ రాముడు నాగిరెడ్డి పాల్గొన్నారు

# అర్హులందరికీ జగనన్న సంక్షేమ పథకాలు

- అవినీతి అన్నది పైస్థాయి నుంచి కింది స్థాయి వరకూ ఎక్కడా లేకుండా పరిపాలన అందిస్తున్న మన ప్రభుత్వం
- కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు, అక్టోబర్ 04, (మనం న్యూస్): 23వ వార్డ్ 59వ సచివా లయం పరిధిలో శ్రీరామ్ నగర్‌లోని సాయంత్రం కొనసాగిన గడపగడ పకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని





ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ అన్నారు. ఈరోజు సాయంత్రం శ్రీరామ్ నగర్ 23 వ వార్డు 59 సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కా ర్యక్రమం నిర్వహించారు.ఇంటింటికీ తిరిగి జగనన్న అందిస్తున్న సేవల గురించి సంక్షేమ పథకాల గురించి ప్రతి ఒక్కరిని వివరించారు.వారి సమ స్యలు అడిగి తెలుసుకొని వెంటనే సంబంధిత అధికారులకు సమస్య పరి ష్కరించాలని అన్నారు.పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వార్డ్ వైస్సార్సీపీ నాయకులు సూచిత రాణి, సునీల్, ఏసన్న, గిరిదర్, ప్రవీణ్, బాలరాం, మాదిలేటి, అరుణ్, అజయ్, వాలి, రఫీక్, సుచరిత, సుహాసిని, శాంతబాయ్, భాగ్యమ్మ, నాగరాజ్, ముఖ్య నాయకులు రైల్వే ప్రసాద్, సంతోష్ కిరణ్, సచివాలయం సిబ్బం ది, మున్సిపాలిటీ సిబ్బంది స్థానిక వైస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు త దితరులు పాల్గొన్నారు.

## కర్నూలు ప్రజల భవిష్యత్తుకు నాది గ్యారెంటీ

- నగరంలోని 24 వ వార్డులో పర్యటించిన టి.జి భరత్



కర్నూలు ప్రతినిధి, అక్టోబర్ 04, (మనం న్యూస్) : కర్నూ లు ప్రజల భవిష్యత్తుకు తాను గ్యారెంటీ ఇస్తానని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టి.జి భరత్ అన్నారు. బుధవారం నగరంలోని 24 వ వార్డు పరిధిలోని లక్ష్మీ నగర్లో ఆయన బాబు ష్యూరిటీ. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం లో భాగంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి తెదేపా మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్ని కల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో ప్రజల భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారెంటీ ఇస్తున్నా రన్నారు. అన్ని వర్గాలు అభివృద్ధి చెందేలా, అందరికీ సంక్షేమ పథకాలు అందేలా చేస్తానని చెబుతున్నారన్నారు. ఇక కర్నూలు ప్రజల కోసం తాను గ్యారెంటీ ఇస్తున్నట్లు చెప్పారు. కర్నూల్లో ఎలాంటి సమస్యలు లేకుండా పరిపాలన సాగిస్తానన్నారు. యు వతకు ఉద్యోగాలు కల్పించేందుకు తాను ష్యూరిటీ ఇస్తానన్నా రు. కర్నూల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని, రాష్ట్రంలో తె లుగుదేశం ప్రభుత్వం వస్తే కర్నూలుకు పరిశ్రమలు తీసుకొచ్చే బాధ్యత తనదన్నారు. ప్రజలు ఆలోచించాలన్నారు. వచ్చే ఎన్ని కల్లో కచ్చితంగా తెలుగుదేశం పార్టీని గెలిపించుకుంటామని ప్ర జలు హామీ ఇచ్చారు. అన్ని వర్గాల ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలని ప్రజలకు టి.జి భరత్ సూచించారు. ఈ సందర్భంగా తమ వీధుల్లో డ్రైనేజీలు నిర్మించాలని, త్రాగునీరు కలుషితం అవుతుందని ప్రజలు మొరపెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రవణమ్మ, నేతలు వెంకటేశ్వర్లు, రాధ, రవి కుమా ర్, లక్ష్మణ్ రావ్, గోపాల్, శ్రావణ్, నందకిశోర్, అజయ్, షేక్ షా, భాను, అహ్మద్ వలి, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

## పండగలాగా జగనన్న ఆరోగ్యసురక్ష! ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా!

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ



పత్తికొండ, అక్టోబర్ 04, (మనం న్యూస్) : వివిధ రకాల రోగాలతో బాధపడుతున్న వారికి మె రుగైన వైద్యం అందిం చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కా ర్యక్రమం పత్తికొండ నియోజకవర్గంలో పండగలా సాగుతుం దని ఎమ్మెల్యే శ్రీదేవమ్మ అన్నారు. బుదవారం పత్తికొండ మం డలం నలకదొడ్డి మరియు తుగ్గలి మండలం మారెళ్ల గ్రామల లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శ్రీదే వమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య అధికారులు,మండల అధికారులు, గ్రామ నాయకులు ఎమ్మెల్యే శ్రీదేవమ్మకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవమ్మ మా ట్లాడుతూ ఆరోగ్య శిబిరానికి హాజరైన వారందరికీ వైద్యపరీక్ష లు నిర్వహించి అవసరమైన మందులను ఇవ్వాలని వైద్యులకు సూచించారు.ఈ పథకం పేదలకు ఆరోగ్య భరోసా కల్పిస్తుంద న్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు అన్నారు.ఇందులో భాగంగానే జగన న్న ఆరోగ్య సురక్ష క్యాంప్ ఎమ్మెల్యే బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ తదితర పరీక్షలు చేయించుకున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్ర మంలో పత్తికొండ మండల జెడ్పీటీసీ ఉరుకుందమ్మ, మరియు వైఎ స్ఆర్ పార్టీ మండల, నలగదొడ్డి గ్రామం వైఎస్ఆర్ పార్టీ నాయకులు తుగ్గలి మండలం వైఎస్ఆర్ పార్టీ నాయకులు, మా రెళ్ళ గ్రామం వైఎస్ఆర్ పార్టీనాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# ఆసియా క్రీడల్లో అదరగొట్టిన భారత్



- జావెలిన్ త్రో, ఆర్చరీలో రెండు స్వర్ణాలు కైవసం
- 18 స్వర్ణాలతో భారత్ 81కు చేరిన పతకాల సంఖ్య

న్యూఢిల్లీ, అక్టోబర్ 4 : ఆసియా క్రీడల్లో భారత్ పతకాల వేట కొనసాగుతోంది. జావెలిన్ త్రో విభాగంలోనే రెండు పతకాలు సొంతం చేసుకున్న భారత్ వంద పతకాలు సాధించాలనే లక్ష్యం దిశగా దూసుకుపోతోంది. 18 స్వర్ణాలతో ఇప్పటివరకూ భారత్ 81 పతకాలను కైవసం చేసుకుంది. అందరి అంచనాలను నిజం చేస్తూ స్టార్ జావెలిన్ త్రో అథ్లెట్ నీరజ్ చోప్రా పసిడి పతకాన్ని సొంతం చేసుకుని సత్తా చాటాడు. ఇదే విభాగంలో నీరజ్‌కు గట్టి పోటీ ఇచ్చిన మరో భారత అథ్లెట్ కిశోర్‌కుమార్ జనా రజత పతకం సాధించాడు. అథ్లెటిక్స్ విభాగంలో సత్తా చాటిన భారత అథ్లెట్లు మరిన్ని పతకాలను ఇండియా ఖాతాలో వేశారు. ఫోర్ ఇన్‌టు 400 రిలేలో భారత్ స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. ఆర్చరీ మిక్స్ డ్ టీమ్ ఈవెంట్‌లో జ్యోతి సురేఖ-ఓజాస్ డియోటలే జోడి స్వర్ణంతో మెరిసింది. అందరి అంచనాలను నిజం చేస్తూ జావెలిన్ త్రోలో భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా 88.88 మీటర్ల దూరం బల్లాన్ని విసిరి పసిడిని ముద్దాడాడు. ఇదే విభాగంలో నీరజ్‌కు గట్టిపోటీ ఇచ్చిన కిశోర్ కుమార్ జెనా కెరీర్ బెస్ట్ నమోదు చేస్తూ రజత పతకం కైవసం చేసుకున్నాడు. 86.77 మీటర్ల దూరం బల్లెం విసిరిన కిశోర్ చివరి వరకూ నీరజ్‌కు గట్టిపోటీనిచ్చాడు. ఆర్చరీ కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో జ్యోతి సురేఖ - ఓజాస్ డియోటలే జోడీ బంగారు పతకం సాధించింది. ఫైనల్లో దక్షిణ కొరియా జట్టును 159-158 తేడాతో భారత్ ఓడించింది. ఆసియా క్రీడల్లో ఆర్చరీలో భారత్‌కు ఇది రెండో స్వర్ణపతకం. ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు సత్తా చాటుతున్నారు. 4 400 మీటర్ల రిలేలో భారత పురుష అథ్లెట్లు స్వర్ణంతో సత్తా చాటగా ఇదే విభాగంలో మహిళా అథ్లెట్లు రజత పతకం సాధించారు. పురుషుల 5 వేల మీటర్ల ఫైనల్‌లో అవినాశ్ ముకుంద్ సాబలే రజతం పతకం అందుకున్నాడు. 18 నిమిషాల 21.09 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని సాబలే రెండో స్థానంలో నిలిచాడు. ఆసియా క్రీడల్లో సాబలేకి ఇది రెండో పతకం. 3 వేల మీటర్ల పరుగులో అతడు ఇప్పటికే పసిడి గెల్చుకున్నాడు. మహిళల 1500 మీటర్లలో రజతం గెలుచుకున్న హర్మిలన్ 800 మీటర్లలోనూ మరో రజతం సాధించింది. పురుషుల గ్రీకో-రోమన్ రెజ్లింగ్ 87 కేజీల విభాగంలో సునీల్ కుమార్ కాంస్య పతకం సాధించాడు. గ్రీకో-రోమన్ రెజ్లింగ్ విభాగంలో భారత్‌కు పతకం దక్కడం ఇదే తొలిసారి. హాకీలో భారత పురుషుల జట్టు సెమీస్‌లో కొరియాను 5-3 తేడాతో ఓడించి ఫైనల్‌కు దూసుకెళ్లి పతకాన్ని ఖరారు చేసింది. బ్రిడ్జిలో చైనాను మట్టికరిపించి ఫైనల్ చేరిన భారత్ కనీసం రజతాన్ని ఖాయం చేసింది. బాక్సింగ్‌లో ఒలింపిక్ పతక విజేత లవ్లీనా బోర్గోహైన్ రజతంతో సరిపెట్టుకుంది. లవ్లీనా ఓటమితో ఆసియా క్రీడల్లో భారత బాక్సర్ల పోరాటం స్వర్ణ పతకం లేకుండానే ముగిసింది. ఒక రజతం, నాలుగు కాంస్యాలతో భారత బాక్సర్లు మొత్తం 5 పతకాలు సాధించారు. ఆసియా క్రీడల్లో భారత పురుషుల హాకీ జట్టు అదరగొట్టింది. సెమీఫైనల్‌లో దక్షిణకొరియాను 5-3 తేడాతో ఓడించి ఫైనల్‌కు చేరింది. ఈ మ్యాచ్‌లో ఐదో నిమిషంలో భారత జట్టు తొలి గోల్ చేసింది. అనంతరం 11వ నిమిషంలో మరో గోల్ చేసింది. దీంతో ఈ మ్యాచ్‌లో భారత జట్టు 2-0తో ముందుకు దూసుకెళ్లింది. ఆ తర్వాత 15వ నిమిషంలో భారత్ మూడో గోల్ చేయగా.. 17వ నిమిషంలో దక్షిణ కొరియా తొలి గోల్ చేసింది. ఆ తర్వాత 20వ నిమిషంలో దక్షిణ కొరియా రెండో గోల్ చేసింది. అయితే ఈ సమయంలో భారత్? 3-2తో ముందంజలో ఉంది. ఆ తర్వాత భారత ఆటగాళ్లు దూకుడుగా ఆడి మంచి ప్రదర్శనను చూపించారు. మళ్లీ 24వ నిమిషంలో భారత్‌కు నాలుగో గోల్ వచ్చింది. దీంతో భారత జట్టు 4-2తో ఆధిక్యంలో ఉంది. ఆ తర్వాత దక్షిణ కొరియా మరోసారి ఎదురుదాడికి దిగింది. 42వ నిమిషంలో దక్షిణ కొరియా గోల్ చేసింది. దీంతో స్కోరు 4-3గా మారింది. భారత జట్టు ఆధిక్యం చెక్కుచెదరలేదు. అంతేకాకుండా.. 54వ నిమిషంలో భారత్ ఐదో గోల్ చేసింది. దీంతో మ్యాచ్‌లో భారత జట్టు 5-3తో ముందంజ వేసింది. చివర్లో భారత్.. దక్షిణ కొరియా ఆటగాళ్లకు గోల్స్ చేసే అవకాశం ఇవ్వకుండా.. మంచి ప్రదర్శన చూపించారు. దీంతో భారత జట్టు 5-3తో దక్షిణ కొరియాను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది.

# రజత పతకాలతో మెరిసిన అవినాష్, హర్మిలాన్

హాంగ్జౌ: చైనాలో జరుగుతున్న 19వ ఆసియా క్రీడల్లో భారత్కు పతకాల పంట పండుతూనే ఉన్నది. బుధవారం జరిగిన పురుషుల 5000 మీటర్ల పరుగు పందెం ఫైనల్ ఈవెంట్లో భారత్ అథ్లెట్, నాయబ్ సుబేదార్ అవినాష్ సాబిల్ రెండో స్థానంలో నిలిచి రజత పతకం సొంతం చేసుకున్నాడు. బహ్రెయిన్కు చెందిన బాలివ్ బిర్హాణి యెమతా, అడ్మాసు దవిత్ ఫికాడు వరుసగా బంగారు, కాంస్య పతకాలు నెగ్గారు. ఇక మహిళల 800 మీటర్ల ఫైనల్ ఈవెంట్లో కూడా భారత్కు రజత పతకం దక్కింది. భారత అథ్లెట్ 25 ఏళ్ల బెయిన్స్ హర్మిలాన్ 2 నిమిషాల 3.75 సెకన్ల టైమింగ్తో రేసును పూర్తిచేసి రెండో స్థానంలో నిలవడం ద్వారా రజత పతకాన్ని సొంతం చేసుకుంది. శ్రీలంక అథ్లెట్ దిస్సనాయక ముదియన్సేలాకు బంగారు పతకం, చైనా అథ్లెట్ వాంగ్ చున్యూకు కాంస్య పతకం దక్కాయి. కాగా, ఈ 19వ ఆసియా క్రీడల్లో భారత్ రికార్డు స్థాయిలో పతకాలను సాధించింది. ఇప్పటివరకు భారత్ జకర్తా ఆసియా క్రీడల్లో సాధించిన 70 పతకాలే అత్యధిక పతకాలు కాగా, బుధవారం ఉదయమే ఆ రికార్డు బద్దలైంది. ఇప్పుడు పతకాల సంఖ్య 80కి చేరువైంది. పసిడి పతకాల సంఖ్య 16కు చేరింది. ఇంకా రెజ్లింగ్, జావెలిన్ త్రో, హాకీ, క్రికెట్లో భారత్కు పతకాలు వచ్చే అవకాశం ఉంది.



# నీరజ్ చోప్రాకు గోల్డ్ మెడల్

హాంగ్జౌ: ఆసియా గేమ్స్ 2023లో భారత జావెలిన్ త్రోయర్, గోల్డెన్ బాయ్ నీరజ్ చోప్రా బంగారు పతకం సాధించాడు. బుధవారం జరిగిన జావెలిన్ త్రో ఈవెంట్లో ఈటెను 88.88 మీటర్ల దూరం విసిరి స్వర్ణం సొంతం చేసుకున్నాడు. భారత్‌కే చెందిన జెనా కిశోర్ కుమార్ ఈటెను 87.50 మీటర్ల దూరం విసిరి రజత పతకం సాధించాడు. తొలి ప్రయత్నంలో నీరజ్ చోప్రా జావెలిన్ను 85 మీటర్ల కంటే ఎక్కువ దూరమే విసిరాడు. కానీ సాంకేతిక లోపంతో ఈ దూరాన్ని లెక్కించలేకపోయారు. దాంతో అతనికి మరో అవకాశం ఇవ్వగా.. 82.38 మీటర్ల దూరమే విసిరాడు. మూడో ప్రయత్నంలో పౌల్ చేసిన నీరజ్ చోప్రా.. నాలుగో ప్రయత్నంలో అత్యధికంగా 88.88 మీటర్ల దూరం విసిరాడు. ఐదో ప్రయత్నంలో 80.80 మీటర్లే విసరగా.. మిగతా బల్లెం వీరులు ఎవరూ నీరజ్ చోప్రాను అధిగమించకపోవడంతో అతనికే స్వర్ణం లభించింది. కిషోర్ కుమార్ తొలి ప్రయత్నంలో 81.26 మీటర్ల దూరం విసరగా.. రెండో ప్రయత్నంలో 79.76, మూడో ప్రయత్నంలో 86.77, నాలుగో ప్రయత్నంలో 87.54 మీటర్లు విసిరి సిల్వర్ మెడల్ సాధించాడు. జపాన్‌కు చెందిన డీన్ రోడెరిక్ గెన్కి 82.68 మీటర్లతో కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. పురుషుల 4400 మీటర్ల రిలే టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు బంగారు పతకం దక్కింది. మహిళల 4400 రిలే ఈవెంట్‌లో రజత పతకం దక్కింది. దాంతో భారత్ పత కాల సంఖ్య 83కు చేరింది. 72 ఏళ్ల ఆసియా క్రీడల చరిత్రలో భారత్కు 83 పతకాలు రావడం ఇదే తొలిసారి. గత ఆసియా గేమ్స్‌లో భారత్ 70 పతకా లను సాధించింది. ఈ సారి 100 పతకాలే లక్ష్యంగా బరిలోకి దిగిన




భారత అథ్లెట్ల బృందం ఆ దిశగా దూసుకెళ్తోంది.ఇంకా ఈవెంట్స్ జరగనున్న నేపథ్యంలో సునాయసంగా 100 పతకాలు అందుకునే అవకాశం ఉంది.

# మూడ్ గురించి ప్రశ్న..

## ఇంటర్వ్యూలోంచి లేచి వెళ్లిన హెబ్బా పటేల్




మనం సినిమా manamcinema

హెబ్బా పటేల్ ప్రధాన పాత్రలో నటించిన ద గ్రేట్ ఇండియన్ సూసైడ్ అనే వెబ్ సినిమా ఈ నెల అక్టోబర్ 6 నుంచి ఆహాలో స్ట్రీమింగ్ అయ్యేందుకు సిద్ధమైంది. గతంలో తెలిసినవాళ్ళు పేరుతో రిలీజ్ కావలసిన సినిమాను ఆహా కొనుక్కుని ఈ మేరకు పేరు మర్చి రిలీజ్ చేస్తోంది. మదనపల్లెలో జరిగిన కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కించినట్లు తెలుస్తోంది. హెబ్బా పటేల్ కీలక పాత్ర పోషించగా రామ్ కార్తీక్, నరేష్, పవిత్రా లోకేష్, జయ ప్రకాశ్ తదితరులు మిగిలిన పాత్రధారులు కాగా ఈ సినిమా ప్రమోషన్లలో పెద్ద ఎత్తున పాల్గొంటోంది హెబ్బా పటేల్. అయితే ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చే క్రమంలో సదరు యాంకర్ అడిగిన ప్రశ్నకు ఫస్ట్ బాగానే ఉన్నానని చెప్పిన ఆమె, ఆ తర్వాత అర్థం కాక అయోమయం ఫేస్ పెట్టి చివరకు హర్ట్ అయ్యి ఇంటర్వ్యూ ఇవ్వలేనని చెప్పి వెళ్లిపోయింది. అయితే ఇది ప్రాంక్ వీడియో కాదని నిజంగా జరిగిందని తెలుస్తోంది. ముందుగా హెబ్బా రాగానే ఈమెను యాంకర్ ఎలా ఉన్నారు అని అడిగి.. 'మీ మూడ్ బాగుందా' అంటూ ప్రశ్నించారు. హా ఓకే అని అంటే యాంకర్ దాన్ని మరింత పొడిగిస్తూ 'మీ మూడ్ ఎప్పుడు ఎలా ఉంటుందో, ఎప్పుడు ఎలా రియాక్ట్ అవుతారో తెలియదు, అందుకే ముందే అడుగుతున్నా, మీతో మాట్లాడొచ్చా అన్న మీనింగ్‌తో మాట్లాడుతున్నా' అని అడిగాడు. హెబ్బాకు అర్థం కాకపోవడంతో.. మీరు ఫ్రీగానే ఉన్నారా.. మీ మూడ్ బాగుందా అని మాత్రమే అడిగానని,అనే సరికి, మూడ్‌తో కనెక్షన్ ఏముందీ ఇది ప్రమోషన్ కదా అని ప్రశ్నిస్తూ.. తాను ఇంటర్వ్యూ ఇవ్వాలని అనుకోవడం లేదని సీరియస్గా లేచి వెళ్లిపోయింది. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# దీక్షను పూర్తి చేసిన రామ్ చరణ్!



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సినిమాల్లో ఎంత స్టైలిష్‌గా కనిపిస్తారో బయట అందుకు భిన్నంగా, చాలా సింపుల్‌గా ఉంటారు. అయ్యప్ప స్వామికి ఆయన పెద్ద భక్తుడు. ప్రతీ సంవత్సరం అయ్యప్ప స్వామి మాలను వేసి దీక్షను తీసుకుంటుంటారనే సంగతి అందరికీ తెలిసిందే. ఈ ఏడాది కూడా ఆయన అయ్యప్ప దీక్షను తీసుకున్నారు. ఈ దీక్షను ముంబైలో సిద్ధి వినాయక ఆలయంలో పూర్తి చేశారు. రామ్ చరణ్ అచంచలమైన భక్తి విశ్వాసాలకు, నమ్మకానికి ఈ ఆధ్యాత్మిక ప్రయాణం ఓ ఉదాహరణ అని చెప్పొచ్చు. అయ్యప్ప స్వామి దీక్షను పాటించే వారు ఎంత నిష్టగా ఉంటారో, మనం గమనిస్తే అర్థమవుతుంది. ఈ సమయంలో రామ చరణ్ కఠినమైన నియమ నిబంధనలను పాటిస్తారు. అయ్యప్ప మాలతో నలుపు రంగు దుస్తులను ధరిస్తారు. చెప్పులను ధరించరు. సిద్ధి వినాయకుని ఆలయంలోకి వెళ్లిన సమయంలోనూ ఆయన ఇదే నియమాలను పాటించటం అనేది అభిమానులను విశేషంగా ఆకర్షించింది. వారి హృదయాల్లో ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారు చరణ్. అలాగే సిద్ధి వినాయకుని ఆలయానికి ఓ ప్రత్యేకత ఉంది. అలాంటి ఆలయంలో రామ్ చరణ్ తన దీక్షను విరమించటం అందరి దృష్టిని ఆకర్షించింది. రామ్ చరణ్ ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ఈ దీక్షను చేస్తుంటారు.

# తెలంగాణ ఫ్లేవర్‌తో ఉయ్యాలో ఉయ్యాలా పాట..




నటసింహం, నందమూరి బాలకృష్ణ ప్రధాన పాత్రలో, డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ భగవంత్ కేసరి. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, హరీష్ పెద్దిలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి మ్యూజికల్ సెన్సేషన్ థమన్ సంగీతం అందించారు. ఈ చిత్రాన్ని అక్టోబర్ 19, 2023 న వరల్ వైడ్‌గా థియేటర్లలో రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుండి రిలీజైన ప్రచార చిత్రాలకి ప్రేక్షకుల నుండి, అభిమానుల నుండి సూపర్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ చిత్రం నుండి ఉయ్యాలో ఉయ్యాల సాంగ్ ను మేకర్స్ రిలీజ్ చేయడం జరిగింది. పాట చాలా ఆకట్టుకుంటుంది. అనంత్ శ్రీరామ్ పాటకి లిరిక్స్ రాయగా, ఎస్పీ చరణ్ పాడటం జరిగింది. ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్, శ్రీ లీల, అర్జున్ రాంపాల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No: 3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No. 23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet, Guntur (District), AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939. Phone No.040-27819999. E-mail Id: editor@manamnews.com.